ప్రజాశక్తి

ఆదివారం 27 ఏప్రిల్ 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

క్యాంపుల్లో కార్పొరేటర్లు

మేయర్ ఎన్నికపై వ్యూహ ప్రతివ్యూహాలు - రేపు ఎన్నికలకు అధికారుల సన్నద్ధం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర పాలక సంస్థ నూతన మేయర్ ఎన్నిక నేపథ్యంలో ప్రధాన పార్టీల కార్పొరేటర్ల క్యాంపు రాజకీయాలు ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి టిడిపి కూటమి కార్పొరేటర్లను చీరాలలోని అతిథి గృహాలకు తరలించగా వైసిపికి చెందిన వారికి కృష్ణా జిల్లా గన్నవరంలో ఏర్పాటు చేసిన క్యాంపులకు తరలించారు. గెలుపునకు తగినంత బలం లేకపోయినా వైసిపి బరిలో నిలిచింది. టిడిపి నుంచి 37వ డివిజన్ కార్పొరేటర్ కోవెలమూడి రవీంద్ర మేయర్‌గా పోటీ చేస్తుండగా వైసిపి నుంచి అచ్చాల వెంకటరెడ్డి పోటీ చేస్తున్నారు. వైసిపి నుంచి టిడిపి కూటమిలోకి చేరిన 18 మంది కార్పొరేటర్ల మద్దతుతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుల ఓట్లతో కలిపి మొత్తం 33 మందితో మేయర్‌గా గెలుపొందేందుకు కోవెలమూడి రవీంద్ర వ్యూహరచన చేస్తున్నారు. అయితే చాలినంత బలం లేకున్నా కేవలం 27 కార్పొరేటర్లు, ఇద్దరు ఎమ్మెల్సీలతో కలిపి మేయర్ పదవికి పోటీ చేయాలని వైసిపి నిర్ణయం తీసుకుంది. అంతేగాక టిడిపి కూటమిలో అసంతృప్తి వాదులకు గాలం వేసేందుకు కూడా వైసిపి అంతర్గతంగా ప్రయత్నిస్తుండగా వైసిపి నుంచి మరికొంత మందిని చివరి నిమిషంలో తమ వైపునకు తిప్పుకునేందుకు కూటమి నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో తొలుత ఎన్నిక ఏకగ్రీవం అవుతుందని భావించిన టిడిపికి వైసిపి తమ బలంతో గట్టి పోటీ ఇస్తోంది. దీంతో ఎవరి సభ్యులను వారు కాపాడుకునేందుకు క్యాంపులు ఏర్పాటు చేశారు.

మరోవైపు టిడిపి అభ్యర్థిగా కోవెలమూడి రవీంద్ర పేరును ఖరారు చేస్తూ బి.ఫారంను జిల్లా పార్టీ అధ్యక్షులు తెనాలి

2లో

కోవెలమూడి రవీంద్రకు బీ ఫారం అందిస్తున్న తెనాలి శ్రావణ్‌కుమార్

ఇతరులు రాకుండా పటిష్ట ఏర్పాట్లు

కార్పొరేషన్ కౌన్సిల్ హాలులో సోమవారం జరిగే మేయర్ ఎన్నికకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అధికారులు కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులకు నోటీసులు జారీ చేశారు. సభ్యులు మినహా మిగతా ఎవ్వరూ సమావేశ మందిరంలోకి రాకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మీడియా గ్యాలరీలోకి కూడా ఇతరుల ప్రవేశాన్ని నిలుపుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు.

తుళ్లూరు సమీపంలో జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయం కోసం భూమిని కేటాయించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిహెచ్ బాబూరావు తదితరులు

అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణంపై మోడీ స్పష్టతివ్వాలి

- భూముల కేటాయింపు, నిర్మాణాల పురోగతిపై శ్వేతపత్రం విడుదల చేయాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు
- రాజధాని ప్రాంతంలో సిపిఎం బృందం పర్యటన

వార్త మెయిన్‌లో

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కొవ్వొత్తుల ప్రదర్శనలో సిపిఎం శ్రేణులు

ఉగ్రదాడితో ముమ్మర తనిఖీలు

పిడుగురాళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని పహల్గాం ప్రాంతంలో తీవ్రవాదులు దాడుల నేపథ్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శనివారం సాయంత్రం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పల్నాడు జిల్లా ఎస్‌పి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లు, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్, లాడ్జిలు, జనసంచార ప్రదేశాల్లో తనిఖీలతోపాటు ప్రధాన ట్రాఫిక్ కూడళ్ల వద్దముఖ్య ట్రాఫిక్ కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నిస్తూ వారి వివరాలపై ఆరా తీశారు. ఎవరైనా అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను ఎస్పీ కోరారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సి.సి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గుంటూరు జిల్లాలోనూ తనిఖీలు జరిగాయి. కనకదుర్గమ్మ వారధి, ప్రకాశం బ్యారేజి, గుంటూరు రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో వాహనాలను, ప్రధాన కూడళ్లలో తనిఖీచేశారు. బస్టాండ్లు, ఆటో స్టాండ్లు, మార్కెట్లు, జన సమూహాలు ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సాంకేతిక పరికరాల ద్వారా అనుమాని తుల వేలిముద్రలు పరిశీలించారు. లాడ్జిలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. సరైన రికార్డులు లేకుండా ఎవరికి గదులు, ఇళ్ల అద్దెలకు ఇవ్వవద్దని ఆదేశించారు. అంతర్ జిల్లా చెక్ పోస్టులు, ఇతర జిల్లాల నుండి జిల్లాలోకి వచ్చే వెళ్లే మార్గాలలో విస్తృత వాహన తనిఖీలు చేశారు. జిల్లా అంతటా భద్రత కట్టుదిట్టం చేశామని గుంటూరు జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు.

పాకిస్తానీయులను గుర్తించాలని కలెక్టర్ ఆదేశాలు

పాకిస్తానీయులను దేశం నుండి ఈ నెలాఖరులోగా తిరిగి పంపించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని పాకిస్తానీయులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒలను ఆదేశించినట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. సాధారణ వీసాలపై వచ్చిన వారు ఆదివారం నాటికి, వైద్య వీసాలపై వచ్చినవారు మంగళవారం నాటికి దేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 30 తర్వాత అట్టారీ సరిహద్దును మూసివేస్తున్న దృష్ట్యా పాకిస్తాన్ నుండి వీసాపై జిల్లాకు వచ్చిన వారిని గుర్తించాలని పేర్కొన్నారు.

నేడు 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ' రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

మరుగున పడుతున్న మాతృభాషను పరిరక్షించాలని, విద్యార్థులు, పరిశోధకులు, ప్రజలకు సమాచార వనరులను అందుబాటులో ఉంచాలని, గ్రంథాలయాల నాణ్యత, పని తీరును మెరుగుపరిచి ఉద్యోగ నియామకాలు జరపాలని, ప్రజల నుండి వసూలు చేసిన గ్రంథాలయ సెస్సును గ్రంథాలయాల అభివృద్ధికే ఉపయోగించాలని కోరుతూ ఆదివారం ఉదయం 9.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు 'ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ' రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె.స్వరూపరాణి తెలిపారు. విజయవాడ గవర్నరుపేటలోని ఎంబి విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో జరిగే ఈ సదస్సులో 'విద్యా సంస్థలు - గ్రంథాలయాలు', 'సాంకేతిక యుగం - పుస్తక పఠనావశ్యకత', 'పౌర గ్రంథాలయాలు - సమస్యలు - పునర్మిర్మాణం', "పౌర గ్రంథాలయాలు- సాహిత్య ప్రాధాన్యత' అంశాలపై పలువురు కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీతలు, కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, మేధావులు మాట్లాడతారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితలు, కవులు, ప్రచురణ కర్తలు, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, ఉపాధ్యాయులు, కళాకారులు, మేధావుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

ఉగ్రదాడులపై కొనసాగిన సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉగ్ర దాడులకు నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శనలు శనివారమూ కొనసాగాయి. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మహాత్మాగాంధి విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, ఎస్.ఆంజనేయులు నాయక్, నాయకులు డి.శివకుమారి మాట్లాడుతూ దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయంగా లబ్ధిపొందడానికి ఈ ఘటనలను వాడుకోకుండా శాంతిభద్రతలను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.రామారావు, కె.కోటేశ్వరరావు, సయ్యద్ రబ్బాని, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక బోసు బొమ్మ సెంటర్లో సిపిఎం శ్రేణులు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టాయి. ఉగ్రదాడుల్లో మృతులకు నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి జె.బాలరాజు మాట్లాడుతూ భారతీయులందరూ ఒక్కటేనంటూ దేశంలో ప్రజల మధ్య ఐక్యత ప్రపంచానికే ఆదర్శమన్నారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, వెంకటనారాయణ, బి.నాగేశ్వరావు, బి.ప్రసాద్, శివనాయక్, ఖాసీం నాయక్, ఏడుకొండలు,

2లో

ట్రావెల్స్ బస్సు బోల్తా - ఒకరు మృతి

2లో

పెదనందిపాడు, సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో నిరసనలు

ఉగ్రదాడులపై కొనసాగిన సిపిఎం నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

జె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు : స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ డి.రమేష్‌బాబు, పిఎఎస్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీరరాఘవయ్య మాట్లాడుతూ దేశంలో అన్ని మతాలవారు కలిసిమెలిసి జీవిస్తున్నారని, ఇదే ఐక్యతను కొనసాగిద్దామని అన్నారు. జి.మోహన్‌రావు, జి.రమేష్, షేక్ షమి, ఎం.లక్ష్మి, జె.రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : మండలంలోని రెంటపాళ్లలో సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మృతులకు నివాళులర్పించిన అనంతరం సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ మాట్లాడుతూశ సమగ్రత, సమైఖ్యత కోసం భారతీయులందరూ కలిసి ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిపై పోరాడాలని పిలుపునిచ్చారు. దాడుల నివారణలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు విఫలమైందే దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాద దాడులను కూడా రాజకీయ లబ్ధికోసం వాడుకోవాలని బిజెపి చూడడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నరసింహారావు, జె.భగత్, బి.రామారావు, డి.మేరమ్మ, గ్రామస్తులు ఎం.శివరావు, అనుష, సుజాత, అమూల్య, లక్ష్మి, తాతారావు, వెంకటపతి, సౌజన్య పాల్గొన్నారు.

క్యాంపుల్లో కార్పొరేటర్లు

(మొదటి పేజీ తరువాయి)

శ్రావణ్‌కుమార్ శనివారం విడుదల చేశారు. ఈ ఫారాన్ని ఆదివారం ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ భార్గవ తేజకు అందివ్వనున్నారు. ఆ పార్టీ తరుపున విప్ కూడా జారీ చేయనున్నారు. 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో వైసిపి నుంచి కార్పొరేటర్లుగా ఎన్నికయిన వారందరికి విప్ జారీ చేయాలని ఆ పార్టీ నిర్ణయించింది. వాస్తవంగా వైసిపి నుంచి 45 మంది ఎన్నికైన వారున్నారు. వీరిలో ప్రస్తుతం వైసిపికి 27 మంది ఉండగా 18 మంది టిడిపి, జనసేనలో చేరారు. దీంతో కూటమి బలం 29కి పెరిగింది. వీరితో పాటు ముగ్గురు ఎమ్మెల్యేలు, గుంటూరు ఎంపితో కలిపి 33 ఓట్లు టిడిపి కూటమి అభ్యర్థి కోవెలమూడికి దక్కే అవకాశం ఉంది. వైసిపికి ఉన్న 27 మందితోపాటు ఇద్దరు ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, లేళ్ల అప్పిరెడ్డితో కలిపి 29 మంది ఉన్నారు. మాజీ మేయర్ కావటి మనోహర్ నాయుడు ఎన్నికల్లో పాల్గొంటారా? లేదా? అనేది సందిగ్ధంగా మారింది. ఆయన రాకుంటే వైసిపి బలం 28కి పడిపోతుంది. ఈ నేపథ్యంలో ఫిరాయించిన కార్పొరేటర్లపై వైసిపి జారీ చేసే విప్ ప్రభావం ఎంత వరకు ఉంటుందనేది చర్చనీయాంశంగా మారింది.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల పరిధిలో చిలువూరు మరియు కంఠంరాజు కొండూరు గ్రామ శివారులో ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి గుడి వరకు తారు రోడ్డు వేయటం శనివారం ప్రారంభించారు. దాదాపు రెండున్నర కిలోమీటర్ల దూరం రోడ్డు పునర్ నిర్మాణానికి రూ.1.8 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి వచ్చేనెల 4న కంఠంరాజు కొండూరు గ్రామ శివారులో శ్రీ మహంకాళి అమ్మవారి గుడి పునర్ ప్రారంభం నేపథ్యంలో పనులపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులకు సహకరించిన మంత్రి లోకేష్‌కు చిలువూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు తోటకూర సీతారామయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ట్రావెల్స్ బస్సు బోల్తా - ఒకరు మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

ప్రయాణికులను కాపాడే ప్రయత్నంలో పోలీసులు

అతివేగంతో వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 11 కెవి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడి ఒకరు మృతి చెందగా ఏడుగురికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని శాంతినగర్ గ్రామం వద్ద శనివారం జరిగింది. ఎస్ఐ సురేష్ వివరాల ప్రకారం.. లక్ష్మీ గాయత్రి ట్రావెల్స్‌కు చెందిన బస్సు హైదరాబాద్ నుండి బాపట్ల జిల్లా చీరాలకు 26 మంది ప్రయాణికులతో వెళుతుండగా 6.30 గంటల సమయంలో శాంతినగర్ వాటర్ ట్యాంక్ వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. బస్సు బోల్తా పడడంతో ప్రయాణికులంతా ఆహాకారాలు చేశారు. వారి అరుపులు విన్న స్థానికులు అక్కడికి వెళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం పోలీసులు రావడంతో పోలీసులు, స్థానికులు కలిసి ప్రయాణికులను బయటకు తీశారు. ఇందుకు 2 గంటలు పట్టగా అప్పటి వరకూ బస్సులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బస్సులో ఇరుక్కుని ప్రాణాపాయ స్థితిలో చిక్కుకుపోవడంతో ఆమెను రక్షించడానికి ఎక్కువగా శ్రమించాల్సి వచ్చింది. మొత్తంగా 8 మందికి తీవ్ర గాయాలు కావడంతో వారిని పలు వాహనాల్లో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు, ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. హైదరాబాద్‌కు చెందిన

మృతుడు మహమ్మద్ ఫరూక్ (ఫైల్)

మహమ్మద్ ఫరూక్ (55)ను ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా కొద్దిసేపటికి మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు మహమ్మద్ ఫరూక్ చిలకలూరిపేటలోని తన బంధువుల ఇంట్లో వివాహానికి హాజరయ్యేందుకు వెళుతున్నట్లు తెలిసింది.

ప్రమాద స్థలిని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా రవాణా శాఖాధికారి సంజీవ్‌కుమార్, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, రూరల్ సిఐ రామకృష్ణ, ట్రాఫిక్ సిఐ లోకనాథం పరిశీలించారు. బస్సును క్రేన్ సాయంతో యథాతథ స్థితికి తెచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆదేశించడంతోపాటు ప్రమాద సమాచారాన్ని రాష్ట్ర హోం మంత్రి అనిత, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం వాటిల్లినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన మద్యం తాగినందునేనని కొందరు ప్రయాణికులు చెబుతున్నారు. ఇందుకుగాను ప్రయాణం మధ్యలో జరిగిన కొన్ని సంఘటనలను పేర్కొంటున్నారు.

అదనపు భూ సమీకరణకు గ్రామసభలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధానిలో రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. భూ సమీకరణ విధానంలో భూములిచ్చేందుకు సిద్ధమైన ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహిస్తోంది. రాజధాని పరిసర గ్రామాల్లో మరో 10 వేల ఎకరాలను తొలి విడతలో సమీకరణ కోసం ఆయా గ్రామాల్లో ప్రాథమిక సమావేశాలను పూర్తి చేసింది. అమరావతి మండలంలోని మూడు గ్రామాల సభల్లో భూములిచ్చేందుకు సిద్ధమంటూనే పలు సమస్యలను ప్రభుత్వం ముందుంచారు. అత్యధికులు అభిప్రాయం ప్రకారమే ముందడగు వేస్తామని ప్రభుత్వం చెబుతోంది.

రాజధానిలో రైల్వేలైన్ ఏర్పాటు, ఇన్నర్ రింగ్ రోడ్డు, పోలవరం, బనకచర్ల ప్రాజెక్టుల కోసం అమరావతి మండలోని పలు గ్రామాల్లో భూసేకరణ చేయాల్సి ఉంది. అయితే ఈ మండలంలోని వైకుంఠపురం, యండ్రాయి, పెదమద్దూరు, కర్లపూడి గ్రామాల్లో రైతులు భూములిచ్చేందుకు ముందుకొచ్చారు. ఈ క్రమంలోనే రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించింది. ఈ నాలుగు గ్రామాల్లో కలిసి 10 వేల ఎకరాల భూమి ఉంది. వీటిల్లో వైకుంఠపురం, యండ్రాయి, పెదమద్దూరు గ్రామాల్లో గ్రామ సభలు పూర్తయ్యాయి. అత్యధిక శాతం మంది రైతులు భూములిచ్చేందుకు సిద్ధగా ఉన్నట్లు చెప్పారు. ఈ గ్రామ సభల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో పాటు సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. భూసేకరణ విధానంలో భూములిస్తే రైతులు నష్టపోతారని భూ సమీకరణ విధానంలో పొలాలు అప్పగిస్తే మేలు జరుగుతుందన్న అభిప్రాయాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వ్యక్తం చేశారు. అయితే రాజధాని అవసరాల కోసం భూములిచ్చేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని తమ డిమాండ్స్ కూడా ప్రభుత్వం విని పరిష్కారం చూపాలని రైతులు అధికారులతో చెప్పారు. గ్రామ కంఠం నుండి 500 మీటర్ల వెలుపలనే భూ సమీకరణ చేయాలన్నారు. రోడ్డు వెంట భూముల అధిక విలువైనవని వాటికి రాజధానిలో ఇచ్చిన జరీబు భూముల ప్యాకేజీ ఇవ్వాలన్నారు. తమకు కోర్ క్యాపిటల్లోనే భూ కేటాయింపులు ఉండేలా చూడాలన్నారు. వైకుంఠపురంలో ఇనాం భూముల సమస్యను ముందుగా పరిష్కరించి ఆ తర్వాతే భూ సమీకరణ చేయాలని కొంతమంది సూచించారు. నాలుగు గ్రామాల ద్వారానే దాదాపు పదివేల ఎకరాల భూమి ప్రభుత్వానికి ఇచ్చేందుకు రైతులు సన్నద్ధత తెలిపారని అధికార వర్గాలు తెలిపాయి.

దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీసేందుకే దాడులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి : హిందూ ముస్లింలు ఐక్యంగా ఉండటం చూసి ఓర్వలేక కొంతమంది ముష్కరులు అమాయకులపై దాడులకు పాల్పడుతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. శనివారం స్థానిక జిన్నా టవర్ నుంచి లాలాపేట వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ భారత దేశం ఐక్యంగా ఉంటుందన్నారు. మరణించిన అమరవీరులకు నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి మేయర్ సజీల, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ పోతురాజు సమత, టిడిపి నాయకులు షేక్ గౌస్, జాగర్లమూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దేశ ప్రజలపై పాకిస్తాన్ ముష్కరులు సాగించిన దమనకాండకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. స్థానిక శ్రీనివాసరావుతోట నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆమె మాట్లాడారు. మరణించిన వారికి నివాళులర్పించారు. డేగల ప్రభాకర్, కోవెలమూడి రవీంద్ర, నిమ్మల శేషయ్య, మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి

కాశ్మీర్ లోని పహల్గమ్ లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన మఅతులకు సంతాపంగా తాడేపల్లి మండల మరియు పట్టణ జనసేన నాయకుల ఆధ్వర్యంలో తాడేపల్లి

మున్సిపల్ ఆఫీస్, ఉండవల్లి సెంటర్ కూడలి నుంచి కేఎల్ రావు కాలనీ వరకు శనివారంక్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించారు. ఉండవల్లి సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. రూరల్ అధ్యక్షులు సామల నాగేశ్వరరావు, టౌన్ అధ్యక్షులు అంబటి తిరుపతిరావు మాట్లాడారు. కోటేష్ బాబు, తిరుపతిరావు, రాజేష్, నాగేశ్వరరావు, రాజా రమేష్ పాల్గొన్నారు.

ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : 2009 విద్యాహక్కు చట్టం కింద బలహీన వర్గాల పిల్లలకు అన్ని ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1 వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఇఒలు ఎం.లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు తెలిపారు. సిబిఎస్ఈ, స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలల్లో ఒకటో తరగతి దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతుందని చెప్పారు. అంధులు, హెచ్ఐవి బాధితులు, ఎస్టి, ఎస్సి, బిసి ఓసి, మైనారిటి వర్గాలు ఇందుకు అర్హులని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.20 వేలు, పట్టణ ప్రాంతంల వారికి రూ.1.44 వేలు వార్షికదాయం కలిగినవారు అర్హులన్నారు. సిబిఎస్ఈ పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవడానికి 2 ఏప్రిల్ 2019 నుండి 31 మార్చి 2020 మధ్య జన్మించిననాటికి ఐదు ఏళ్ళు నిండి ఉండాలన్నారు. అలాగే స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలల్లో దరఖాస్తుకు 2 ఏప్రిల్ 2019 నుండి 31 మే 2020 మధ్య జన్మించి ఐదు సంవత్సరాలు నిండి ఉండాలన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్స్ అయిన ఉడతా శివ కోటేశ్వర రావు S/o సుబ్రహ్మణ్యం (ఆధార్ నెం-4584 5241 4408), డోర్‌నెం-11-105బి1, సీతారామస్వామి కోవెల, పాత మంగళగిరి, మరియు జొన్నకూటి కుమారరాజా S/o జొన్నకూటి వెంకటేశ్వర రావు (ఆధార్ నెం-8986 6165 8949), డోర్ నెం-1-16, ఆత్మకూరు, మంగళగిరి వారి సంజాయిషీ పొంది ఈ ప్రకటన ఇచ్చుచున్నాము.

మా క్లయింట్ అయిన ఉడతా శివ కోటేశ్వర రావు గారు వారి ఇంటి వద్ద నుండి ది.21-04-2025న షుమారుగా ఉదయం 11గం.లకు రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్ళుచుండగా దారిలో జిరాక్స్ షాప్ వద్ద జిరాక్స్ తీపించుకోని రిజిస్ట్రేషన్ ఆఫీసునకు వెళ్ళిచూసుకొనగా చేతి సంచి జారిపోయినది అని గమనించుకొని వచ్చిన దారినే వెతుకుంటూ వెళ్ళగా చేతి సంచి యొక్క ఆచూకీ తెలియలేదు.సదరు చేతి సంచి నందు వారి యొక్క ఆత్మకూరు విలెజ్ నందలి డి.నెం.29, సర్వే నెం.207/2 లోని 440 చ।గ।। ఖాళీ స్థలం తాలూకు కోర్ట్ వేలంలో కొనుగోలు చేసిన ఒరిజినల్ దస్తావేజులు నెం.-21/2012 (మైనస్ 21/2012), మరియు లింక్ దస్తావేజు ఒరిజినల్ 431/1965 లు మరియు ఇతర కోర్ట్ పేపర్స్ వారి యొక్క ఆధార్ కాపీలు కలవు.

సదరు చేతిసంచీ, దస్తావేజులు ఎయారీకైనా దొరికినచో దయచేసి మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానీ, దిగువ తెలియపరచిన లాయర్ గారి ఆఫీస్‌లో గాని అందజేయగలరు. అట్లు కాక సదరు దస్తావేజులను ఎవరైనా దుర్వినియోగ చేయదలచిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకొనబడునని ఇందుమూలముగా తెలియచేయటమైనది.

షెడ్యూల్

గుంటూరు డి,మంగళగిరి.సబ్‌యీలకా,ఆత్మకూరు విలెజ్ కు చెందిన డి.నెం.29, సర్వే నెం.207 /2 లోని 440 చ।గ।। ఖాళీ స్థలం నకు హద్దులు.

తూర్పు - కేలం వెంకయ్య గారి ఇంటి స్థలం.
దక్షిణం - రాజ వీధి.
పడమర -రాజ వీధి.
ఉత్తరం -తోట సత్యనారాయణ ఇంటి స్థలం.
స్థలం : మంగళగిరి
తేది : 26-4-2025

PITHALLA MASTAN RAO, MBA, LL.B.
P V Karan Teja, B.Tech, LL.B
ADVOCATEs
Plot No. 403, A Block, Opp. Auto Nagar,
Sri Balaji Fourtune Towers,
MANGALAGIRI - 522503, Guntur Dt.

విఆర్ఎలకు రక్షణ కల్పించి, సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి – మాచర్ల

మన్యం జిల్లాలో గురువారం రీసర్వేలో పాల్గొన్న వీఆర్ ఏ పెంచలయ్యపై దాడి చేయడం హేయమైన చర్యని వీఆర్ఏ సంఘం నాయకులు ఎం. శ్రీని వాసరావు అన్నారు. వీఆర్ఏలకు రక్షణ కల్పించాలని, వీఆర్ఏల సమస్యలను పరిష్కరించా లని శనివారం తహ శీల్దార్ కిరణ్‌కుమార్‌కు వీఆర్ఏ సంఘం నాయకులు వినతి పత్రా న్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విధినిర్వహణలో వున్న వీఆర్ఏ పెంచలయ్యపై దాడి చేసిన వారిని కఠిన శిక్షించాలని, వీఆర్ఏలకు రక్షణ కల్పించాన్నారు. గ్రామ రెవిన్యూ సహాయ కులకు తక్షణమే పేస్కేలు అమలు చేయాలని, అర్హులకు వీఆర్వో లుగా ప్రమో షన్లు ఇవ్వాలని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏ లుగా నియమించాలని, అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమో షన్ కోటాను 70 శాతానికి పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని టిఎ, డిఎ కూడా ఇప్పించాలని వినతి పత్రంలో కోరారు. వినతిపత్రం అందించిన వారిలో టి.రామారావు, బి.అనంద్‌రాజు, శిరీష ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ప్రభుత్వ జిల్లా విద్య శిక్షణ సంస్థల్లో (డైట్స్), ప్రైవేట్ ఎలిమెంటరీ టీచర్ ట్రైనింగ్ ఇన్‌స్టి ట్యూషన్స్‌లో 2 ఏళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ప్రవేశానికి అభ్యర్థుల ఎంపిక కోసం ఆన్‌లైన్ (డీసెట్-2025) ద్వారా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2025-2026 కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయని ఎంఏఎం గ్రూప్ ఆఫ్ కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు తెలిపారు. అభ్యర్థులు వచ్చే నెల 8వ తేదీ లోగా https://cse.ap.gov.in & https: //apdeecet. apcfss.in నందు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవా లన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల ను సమర్పిం చడానికి అర్హత ప్రమాణాలు – మార్గదర్శకాలతో పాటు వివరణాత్మక నోటిఫికేషన్‌ను పై వెబ్‌సైట్ నుండి ఏప్రిల్ 21 నుండి డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. మాన్యువల్ అప్లి కేషన్‌లు అంగీకరించబడవన్నారు. జూన్ 2, 3వ తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మేనేజ్మెంట్ కోటా వారికి కూడా సెట్ క్వాలిఫికేషన్ తప్పనిసరి అన్నారు.

విద్యార్థులలో విజ్ఞాన నైపుణ్యం పెంపొందించాలి

గ్రంథాలయ అధికారి వేణు గోపి

ప్రజాశక్తి – దుర్గి

విద్యార్థులలో విజ్ఞాన నైపుణ్యం పెంపొందిం చేలా విద్యార్థుల తల్లిదండ్రులను దొరికి గ్రంథాలయ అధికారి పి వేణుగోపి శనివారం అన్నారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 28 నుండి జూన్ 6 వరకు విద్యార్థులకు గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ వారి ఆదేశాల మేరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు దుర్గి గ్రంథాలయం తరచి ఉంటుందని అన్నారు. 10 నుండి 15 సంవత్సరాలలోపు విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-ఈపూరు

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్,ఎక్సైజ్ సీఐ డి వెంకటేశ్వర్లు అన్నారు. మద్యపానం, గంజాయి, డ్రగ్స్ తీసుకోవ డం ద్వారా కలిగే దుష్ఫలితాలపై మండల కేంద్రం ఈపూరులో శనివారం ఎక్సైజ్ పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మానవ హారంగా ఏర్పడి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై కె శ్రీనివాస రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎడ్ల పందేలు - విజేతలకు బహుమతులు ప్రదానం

బహుమతులు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి – వినుకొండ

ముఖ్యమంత్రి చంద్రబాబు శరవేగంగా పూర్తి చేస్తున్న పోలవరం, ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పోలవరం–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుతో రాష్ట్రం సస్యశ్యామలం కాబోతోం దన్నారు మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు. పల్నాడు ప్రాంతం అన్నదాతలు గోదావరి నీళ్లతో మొదటి పంట, నాగార్జునసాగర్ నీళ్లతో 2వ పంట పండించుకునే రోజులు త్వరలోనే రాబోతున్నాయని తెలిపారు. వినుకొండ మండలం మదమంచిపాడు ఆంజనేయ స్వామి తిరనాళ్ల సందర్భంగా నిర్వహించిన ఎండ్ల పందేల పోటీల ముగింపు కార్యక్రమంలో శనివారం వారివురు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీల్లో సీనియర్ విభాగం లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎడ్ల పందేల నిర్వాహకులను సన్మానించారు. అనంతరం మాట్లాడిన మంత్రి గొట్టిపాటి తెలుగుదే శం పార్టీ గత ప్రభుత్వంలో 70శాతం పూరైన పోలవరాన్ని జగన్ 5ఏళ్లు నిర్లక్ష్యం చేశారని, మూడు రాజధానుల పేరుతో అమరావతిని అడ్డుకున్నారని విమర్శిం చారు. పోలవరం– బనకచర్ల లింక్‌కు సుమారు రూ.80 వేల కోట్లు ఖర్చుకానున్నా రాష్ట్రంలోని ఏ రైతు పొలం నీరు లేక ఎండిపోవద్ద సంకల్పంతో చంద్రబాబు ఈ బహత్తర ప్రాజెక్టు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పోలవరం–బనకచర్ల అనుసంధానంలో భాగంగా సీఎం చంద్రబాబు తలపెట్టిన బొల్లాపల్లి రిజర్వాయర్ నాగార్జునసాగర్ తరహాలోనే రాష్ట్రంలోనే ప్రత్యేక నిలవబోతోం దన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలి : చీఫ్‌విప్ జీవీ

ప్రజాశక్తి – వినుకొండ

ప్రజలకు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్‌ను సద్వినియో గం చేసుకోవాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. వచ్చే వారం నుంచి ప్రతిశుక్రవారం వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ ఉంటుందని, తానే ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన ప్రకటించారు. వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ కార్యాల యంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ సందర్భంగా ఈ మేరకు వెల్లడించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను నేరుగా విన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకునే దిశగా ఆదేశాలు జారీ చేశారు. వివిధ అంశాలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వీటన్నింటినీ పరిశీలించి, పరిష్కారాలు సూచించామన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలని కోరారు. ప్రజాసమస్యల పరిష్కారమే అందరి ఏకైక అజెండా కావాల న్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాగశ్రీను రాయల్ పాల్గొన్నారు.

పొగాకు గ్రేడింగ్ కంపెనీలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి – తాడికొండ

పొగాకు గ్రేడింగ్ కంపెనీలో అగ్నిప్రమాదం సంబవించిన ఘటన శనివారం తాడికొండ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం విజయ భాస్కర్ టొబాకో గ్రేడింగ్ కంపెనీ నందు షుమారు 70 మంది మహిళలు పొగాకు గ్రేడిం గ్ చేస్తుండగా, గ్రామంలో మృతి చెందిన వ్యక్తి అంతిమ యాత్రలో దీపావళి మందులు పేలుస్తుండగా ప్రమాద వశాత్తు అవ్వ సువాయి వెళ్లి పందిరి మీద పడి క్షణాలలోనే మంటలు ఎగిసిపడి పందిరంతా పూర్తిగా తగలబడి బూడిదయింది, అదష్టవశాత్తు మహిళలకు విరామ సమయం కావడంతో ప్రాణా పాయం తప్పింది, తాటాకు పందిరి గోతాలు పూర్తిగా తగలబడి పోయాయి, స్థానికులు ఫైర్ ఇంజన్‌కి సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు

చెలరేగుతున్న మంటలు

లోకి తెచ్చారు. సుమారు రెండు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

మద్యపానం, డ్రగ్స్‌తో జీవితం అంధకారం

మత్తుపదార్థాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ

ప్రజాశక్తి – సత్తెనపల్లి రూరల్

ఆల్కహాల్ వినియోగం వలన కలిగే నష్టాలపై ఎక్సైజ్ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సత్తెన పల్లి మండలం కంటెపూడి నలంద కాలేజీ లోని ఫార్మసీ విద్యార్థుల కు శనివారం మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాల పై ఎక్సైజ్ సీఐ విజయకుమార్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగం వలన మానవ శరీరంలోని అన్ని వ్యవస్థలు దెబ్బతింటాయని ముఖ్యంగా కాలేయం, మెదడు, గుండె వంటి ప్రధాన అవ యవాలు రోగగ్రస్తమవుతాయని, క్యాన్సర్, మధుమేహం, రక్త పోటు, వంధ్యత్వం, అల్సర్లు వస్తాయని, ఉద్రే కాలు అదుపుతప్పి కోపం, చిరాకు, అసహనం వంటి మానసిక రుగ్మతలు రావడం ఏకాగ్రత లోపించడం, నిద్రలేమి, మతిమరుపు వంటి సమస్య లు తలెత్తుతాయని సూచించారు. విద్యార్థులు మద్యానికి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తల్లిదండ్రులు అధ్యా పకులు చెప్పే మంచి విషయాలను పాటించాలని చెప్పారు. జీవితంలో మంచి లక్ష్యాలను ఏర్పరచుకునీ విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని విద్యార్థులకు అవగా హన కల్పించారు. విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సై కే.నాగలక్ష్మి ఎక్సైజ్ సిబ్బంది నరసింహారావు, దాసు, భాజా, హనుమ, ఆనంద్ నలందా అధ్యాపకులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి – పెదకూరపాడు

మత్తు పదార్థాలు ప్రాణాంతకం అని పెదకూరపాడు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు అన్నారు. శనివారం కాకతీయ కాలేజీలో విద్యార్థులకు ఆల్కహాల్ డ్రగ్స్ ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ ఆల్కహాలు విద్యార్థుల యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. వాటి జోలికి ఎవరు వెళ్లవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని పలు హోటల్స్ , లాడ్జిలు శని వారం తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణ రాజు తమ సిబ్బందితో కలిపి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు డిఎస్పి మురళీకష్ణ ఆదేశాల మేరకు తాడేపల్లి పలు ప్రాంతాల్లో ఉన్న లాడ్జిలు, హోటల్స్‌ని తనిఖీ చేసినట్లు చెప్పారు. లాడ్జిల్లో ఉన్న రిసెప్షన్లో వారితో మాట్లాడి ఎవరెవరు వస్తున్నారు, ఎవరు వెళుతున్నారు తదితర అనేక విషయాలను రిజిస్టర్లు చూసి తెలుసుకున్నారు. లాడ్జి రూమ్స్‌లో ఉంటున్న వ్యక్తులతో మాట్లాడి ఎక్కడి నుంచి వచ్చారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రత చర్యల్లో భాగంగా ఈ తలిఖీలు నిర్వహించినట్లు ఆయన చెప్పా రు. ఈ తనిఖీల్లో సీఐతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్టు

రూ.23 వేలు స్వాధీనం

ప్రజాశక్తి – దుర్గి

మండలంలోని ముటుకూరు గ్రామంలో పేకాట రాయుళ్ల స్థావరాలపై శనివారం దుర్గి ఎస్సై సుధీర్ కుమార్ తన సిబ్బంది తో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ముటుకూరులోని గవర్నమెంట్ హాస్పిటల్ సమీపంలో పేకాట ఆడుతున్న 12 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి దగ్గర నుండి 23 వేల రూపాయలు వసూలు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి – నకరికల్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందిం చాలని పల్నాడు జిల్లా విద్యుత్ పర్యవేక్షణ ఇంజనీర్ డాక్టర్ పత్తిపాటి విజయకుమార్ తెలిపారు. నకరికల్లు సబ్ స్టేషన్ సెక్షన్ పరిధిలోని 33 /11 కె.వి చల్ల గుండ్ల సబ్ స్టేషన్ ను శనివారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ 100శాతం విద్యుత్ రెవిన్యూ వసూలు చేయాలని, ప్రతి నెల రెండవ శనివారం విద్యుత్ లైన్స్ మెయింటెన్స్ చేయాలని, నూతన సర్వీసులను త్వరగా మంజూరు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభు త్వం వారు 50శాతం రాయితీతో అదనపులోడును క్రమ బద్ధీకరించుకొనుటకు జూన్ 30 వరకు అవకాశం ఉందని తెలిపారు. అదనపులోడు రెగ్గులైజర్ చేయించుకున్న వినియోగ దారులకు గరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ డిఈఈ బి వెంకటేశ్వర్ రెడ్డి, నకరికల్లు ఏఈ షేక్ గౌస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషన్ ఎదుట కంతేరు గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి – తాడికొండ

తమపై అకారణంగా దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని కోరుతూ కంతేరు గ్రామస్తులు శనివారం తాడికొండ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. తాము ఫిర్యాదు ఇచ్చిన కేసు నమోదు చేయలేదని పోలీసులతో వాగ్వాదానికి దిగారు.తమపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయకుండా ఉంటే సహించేది లేదని హెచ్చరించారు.సేకరించిన వివరాల ప్రకారం చిన్నపిల్లల వివాదం పెద్దవాళ్లకు చేరి గ్రామంలో రెండు వర్గాలుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే పరిస్థితికి దారితీసింది. కంతేరు గ్రామంలోని ఒక వర్గం బాలూరు ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం మీద అతివేగంగా ప్రయాణిస్తుం డాన్ని ప్రశ్నించిన మరో వర్గం యువకులు. మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకొని పోలీస్ స్టేషన్లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు.

సమీరాను అభినందిస్తున్న తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఎంఈవో

షేక్ సమీరాకు అభినందనలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన స్థానిక జిల్లా పరిషత్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ సమీరాను అధికారులు అభినందించారు. 596 మార్కులు సాధించి డివిజన్ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన సమీరాను శనివారం మాచర్ల తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఎంఈఓ అల్లి సురేష్, విశ్రాంత ఎంఈఓ వేములనాగయ్య అభినందించారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలు మంచి ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. సరైన ప్రణాళికతో కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిరూపించారన్నారు. దీని వెనుక ఉపాధ్యాయులు కృషి దాగుందని వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ షేక్ సకీనా, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎన్ఇసి విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కోటప్పకొండ రోడ్డులోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. తమ కళాశాలకు చెందిన జి.ధరణి, బి.పార్థు ఏడు కొండలు, ఎం.విష్ణు, వై.సురేష్, ఎం.ఉదయ్ కిరణ్ సాఫ్ట్‌బాల్‌లో విశ్వవిద్యాలయ జట్టుకు ఎంపికయ్యా రన్నారు. వచ్చే నెల 4 నుండి 8 వ తేదీ వరకు నెల్లూరు విక్ర మ సింహపురి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్ బాల్ టోర్నమెంట్‌లో జెఎన్టీయూ-కాకినాడ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. జాతీయ సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్. కృష్ణారెడ్డి, ఎన్. ఆంజనేయులు, పి.విజయ కుమార్ అభినందనలు తెలిపారు.

విద్య హక్కు చట్టాన్ని అవగాహన చేసుకోవాలి

విద్యాశాఖ అధికారి టి. రవికుమార్

ప్రజాశక్తి - కారంపూడి

రవికుమార్

విద్య హక్కు చట్టం 2009పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖ అధికారి టి. రవికుమార్ సూచించారు. కారంపూడి పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయంలో శనివారం అయన మాట్లాడుతూ విద్య హక్కు చట్టం సెక్షన్ 12(1)సి పై అవగాహన కల్పించారు. కారంపూడి పట్టణంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఐదు సంవత్సరముల వయసు నిండిన పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం కొరకు దరఖాస్తు చేసుకోవాలని వారు తెలియజేశారు. ఏప్రిల్ 28 నుండి మే 15వ తేదీ వరకు ఆన్లైన్లో లేదా మీసేవ కేంద్రాలలో లేదా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు. మొదటి లాటరీ ఫలితాలు 24 మే, రెండవ లాటరీ ఫలితాలు జూన్ ఆరవ తేదీన నిర్ధారించబడ తాయని ఆయన తెలిపారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చే నెల 15వ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలన్నారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.లక్షా ఇరవై వేలు, పట్టణ ప్రాంతంలో రూ. లక్షా 44వేలు లోపు ఆదాయం ఉన్నవారు అర్హులని చెప్పారు. చిరునామా ధ్రువీకరణకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితరు గుర్తింపు కార్డులు జత చేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాల కొరకు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని సందర్శించవచ్చని ఆయన తెలిపారు.

ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక స్పందనకు 34 దరఖాస్తులు

సమస్యలు వింటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.అరుణ్ బాబు అధ్యక్షతన శనివారం ఎస్‌సి, ఎస్‌టి ల అభ్యున్నతికై ప్రత్యేక సమస్యల పరిష్కార వేదికను ప్రతి నెల 4 శనివారం నిర్వహిస్తున్నారు. శనివారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా వ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి ల 34 దరఖాస్తులు అందాయి. దీనిపై స్పందించిన కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత శాఖలకు ఆయా ఫిర్యాదులను అందజేసి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన వర్గాలు వారి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవతో ప్రతి నెల 4వ శనివారం నిర్వహి స్తున్న ప్రత్యేక కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలకు మెరుగైన పరిష్కార మార్గం చూపాలని అధికారులకు సూచించారు. ఈ అవకాశం ఆయా వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెసి సూరజ్ గనోరే ధనుంజయ్, డిఆర్ఓ మురళి అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పింఛను పంపిణీ చేయండి

ప్రతి నెలా ఒకటో తేదీన నిర్వహించే పింఛను పంపిణీ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు గ్రామం వార్డు సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. పింఛను పంపిణీ ఫీడ్ బ్యాక్ సర్వేపై కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. పింఛను పంపిణీ కార్యక్రమంపై నేరుగా లబ్ధిదారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరుగుతోందన్నారు. పింఛను దారులతో ప్రవర్తించే విధానం, పింఛను పంపిణీలో అక్రమాలు, ఇంటి వద్దే పంపిణీ వంటి అంశాలపై ఫీడ్ బ్యాక్ స్వీకరిస్తున్నామన్నారు. పదే పదే నెగెటివ్ ఫీడ్ బ్యాక్ అందిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. జీవిత భాగస్వామి పింఛను బదిలీ కోసం అందిన 3900 వరకూ దరఖాస్తులను ఒక్క రోజులో ఆమోదించాలన్నారు. ఆధార్ లేని శిశువుల సర్వే, సిటిజెన్ ఈకేవైసీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి వెంకట్ రెడ్డి, డీఎల్డీవో గబ్రు నాయక్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.300కుపైగా వేతనాలు అందేలా పనులు చేపట్టండి

జిల్లాలో ఉపాధి హామీ కూలీల సగటు వేతనం రూ 300 పైనే ఉండేలా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రోజుకు 90 వేల శ్రామికులకు ఉపాధి కల్పించడం లక్ష్యంగా నిర్దేశించగా సగటున 50 శాతం మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఎంలు ఉపాధి కల్పనలో రోజు వారీ లక్ష్యాలను చేరుకునేలా కృషి చేయాలన్నారు. జిల్లాకు మంజూరైన 6500 ఫారం పాండ్లకు గానూ 2,200 ఫారం పాండ్ల నిర్మాణానికి అనుమతులు పొందాల్సి ఉందన్నారు. ఇప్పటికే అనుమతులు పొందిన 4,341 పాండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. 12 వేల కి.మీ మేరకు కాల్వల పూడిక తీత పనులు, 553 చెరువుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మురళి, జిల్లా అటవీ అధికారి కృష్ణ ప్రియ, డ్వామా పీడీ సిద్ధ లింగ మూర్తి, డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు రైతుల సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరిస్తుంది

వ్యవసాయ, రైతు సంఘాల నాయకులతో ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బర్లీ పొగాకు రైతుల సమస్యల్ని అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, పొగాకు కొనుగోలుకు ఉన్న అడ్డంకులు, ఇతర అంశాలపై ప్రభుత్వం సంబంధిత అధికారులు, విభాగాలతో సంప్రదింపులు జరుపుతోందని, త్వరలోనే సమస్య పరిష్కరిస్తుందని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. తన కార్యాలయం లో శనివారం బర్లీ పొగాకు రైతుల ఇబ్బందులను తెలియ చేస్తూ నియోజకవర్గ వ్యవసాయ, రైతు సంఘాల నాయకు లతో వినతిపత్రం తీసుకుని అన్నారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ నియోజకవర్గంలో బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంట దిగు బడి బాగున్నా కొనేవారు లేక సాగుదారులు బోరుమం టున్నా రని, సమస్య పరిష్కారంపై ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని రైతుసంఘం నేతలతో అన్నారు. పొగా కు కంపెనీలు రైతుల్ని నమ్మించి మోసగించాయని, వాటి పనితీరుపై కూడా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశానని ప్రత్తిపాటి పుల్లారావు సంఘ నాయకులకు చెప్పారు. రైతులు, వ్యవసాయసంఘాల నేతలు, రాజకీయపార్టీల నాయకులు ఒక కమిటీగా ఏర్పడి, సమస్య తీవ్రతను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళదామని ప్రత్తిపాటి సూచించారు. మాజీ మంత్రికి వినతిపత్రం ఇచ్చినవారిలో నల్లమల రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లారాజమోహన్‌రావు, సిఐ టియు మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, సాతులూరి బాబు, సాతులూరి లుతర్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఎం రాధాకృష్ణ సిపిఐ నాయకులు తాళ్లూరు బాబురావు ఎస్కే సుభాని నాయకులు, రైతులు ఉన్నారు.

అన్నమయ్య జిల్లాలో విఆర్ఎపై దాడికి ఖండన

నలబ్యాడ్జీలతో నిరసన తెలిపిన విఆర్ఎల సంఘం

ప్రజాశక్తి-సత్తెనపల్లి: అన్నమయ్య జిల్లాలో వీఆర్ఏ పెంచలయ్యపై జరిగిన దాడిని పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం తీవ్రంగా ఖండిం చింది ఈ మేరకు స్థానిక సంఘ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీ లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఆంజ నేయులు నాయక్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి మీద దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. తక్షణమే దాడి చేసిన వ్యక్తి మీద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ వీఆర్ఏల మీద ఇటీవల దాడులు పెరిగాయని, వీఆర్ఏలకు రక్షణ కల్పిం చాలని, అధికారుల ఒత్తిడి తగ్గించాలని, పని భారం తగ్గించాలని అన్నారు. విఆర్ఏలు శ్రమ దోపిడీకి గురవుతున్నా రని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్ఏలకు రక్షణ లేదని, జీతం బెత్తడు వీఆర్ఏలతో బండ చాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం గౌరవాధ్యక్షురాలు జి మల్లేశ్వరి

నిరసన తెలుపుతున్న విఆర్ఏలు

మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని, భవిష్యత్తులో వీఆర్ఏలపై ఇటువంటి దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వీఆర్ఏలకు పేస్కేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మండల అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి ముస్తఫా, బెల్లంకొండ మండలం అధ్యక్షులు సుందర్ రావు, కార్యదర్శి ఆంజనేయులు వీఆర్ఏలు పాల్గొన్నారు.

తలపడుతున్న క్రీడాకారులు

హోరాహోరీగా బాలుర వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం రామకష్ణాపురం పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో 54వ రీజియన్ స్థాయి అండర్ 17 బాలుర వాలీబాల్ పోటీలు అట్టహాసంగా శనివారం ప్రారంభమయ్యాయి. మొత్తం 18 జట్లు టోర్నమెంట్లో పాలొన్నాయి. నాక్ అవుట్ పద్ధతిలో లీగ్ మ్యాచ్ లు జరిగాయి. 8 జట్లు క్వార్టర్ ఫైనల్స్ కు చేరాయి ఖమ్మం, సత్తెనపల్లి, హకింపేట, విజయవాడ 1. తెనాలి, వెంకటగిరి వాల్తేరు, కర్నూలు, జట్లు క్వార్టర్ ఫైనల్స్ కు చేరినట్లు కేంద్రీయ విద్యాలయం ఇన్చార్జి ప్రిన్సిపాల్ బి కిరణ్ రెడ్డి తెలిపారు. ఆదివారం సెమిఫైనల్స్, ఫైనల్స్ జరుగుతాయని చెప్పారు.

విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న దొరరాజు

పావని చంద్రికకు రూ.లక్ష అందజేసిన దొరరాజు

ప్రజాశక్తి - కారంపూడి

ఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే మొదటి ర్యాంక్ సాధించిన పల్నాడు జిల్లా, కారంపూడి మండలం, ఒప్పిచర్ల గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన అంగడి. పావని చంద్రిక 600లకు 598 మార్కులు సాధించిన విషయం విదితమే. విద్యార్థినికి ప్రోత్సాహ బహుమతిగా పావని చంద్రికకు హైదరాబాద్‌కు చెందిన అలివ్ స్వీట్స్ అధినేత దొరరాజు రూ.లక్ష బహుమతిని అందజేశారు. సుమన్ టీవీ ఆధ్వర్యంలో ప్రముఖ ఆడిటర్ అప్పికట్ల శ్రీనివాస్ సీతరం చొరవతో ఈ బహుమతి అందజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని మంచి ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో ఈ ప్రోత్సాహక బహుమతి అందజేసినట్లు దొరరాజు తెలిపారు.

ముంపు బారి నుండి పొలాలను కాపాడండి

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ స్మాల్ ఫిల్లింగ్ స్టేషన్ సమీపంలో మురుగు వర్షపు నీరు పోక ఉండవల్లి,తాడేపల్లి,నులకపేట ప్రాంతాల కు చెందిన రైతుల పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రైతు సంఘం నాయకులు మరియు రైతులతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 150 ఎకరాల వ్యవసాయ భూమి ముంపుకు గురవుతుంది అని చెప్పారు. గతంలో ఈ డ్రైనేజీ కాల్వను పూడికలు తీసి వర్షపు నీరు ప్రవాహానికి అంతరాయం లేకుండా అధికారులు చూసేవారిని తెలిపారు. ప్రస్తుతం గోడ ఆటంకంగా ఉండి హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఆవరణ లోపల ఉన్న డ్రైనేజీ మొక్కలు,

మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తూటి కాడ గుర్రపు డెక్క మేటలు వేసి, మురుగుపారుదల లేక తీవ్ర ఇబ్బంది కరంగా మారింది అని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే డ్రైనేజీ బోర్డు అధికారులు స్పందించి ఈ ఎండాకాలంలోనే వర్షపు నీరు బయటకు పోవటానికి వీలుగా డ్రైనేజీలో పూడిక తీసి మొక్కలను నిర్మూలించి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని కోరారు. తాడేపల్లి రైల్వే ట్రాక్ ఆరు తూముల కింద నుండి బకింగ్ కామ్ కెనాల్ వరకు డ్రైనేజీ రిపేర్ చేయించవలసినదిగా డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ క అలాగే తాడేపల్లి ఐఓసీ వద్ద పాత జిఎన్టి రోడ్డు నుండి యూటీకే పంట కాలువ పక్కన రోడ్డు నిర్మాణం చేపట్టాలని, నూతనంగా నిర్మించిన గుంటూరు రైల్వే ట్రాక్ కింద అండర్ పాస్ నీటితో నుండి రైతుల రాకపోకలకు తీవ్ర అంతరాయం గా మారిందని, మీరు నిలబడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు పండించిన పంటలను సకాలంలో మార్కెట్కు తరలించడానికి ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఏపీఎస్ ఐడీసీ అధికారులు తారు రోడ్డు పనులను,యుద్ధ ప్రాతిపదికన పైన పేర్కొన్న పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాలువను పరిశీలించిన వారిలో రైతు సంఘం తాడేపల్లి అధ్యక్షులు మోదుగుల శ్రీనివాస రెడ్డి, రైతు సంఘ నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి,మేక అమరారెడ్డి, తమ్మ నారాయణరెడ్డి, సాంబిరెడ్డి,దాసరి నవీన్, రమేష్ బుర్రముకు రాజశేఖర్ రెడ్డి, భీమిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రో-వైస్ ఛాన్సలర్గా డాక్టర్ సతీష్ కుమార్

ప్రజాశక్తి – మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం నూతన ప్రో-వైస్ ఛాన్సలర్గా ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. సిక్కిం ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్గా ఈయన్ను యాజమాన్యం ఇటీవలే ఏపీ ఎస్ఆర్ఎం బాధ్యతలను అప్పగించింది. ఆంధ్రా యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన డాక్టర్ సతీష్ కుమార్ పంజాబీ యూనివర్సిటీలో పీహెచ్డీ పట్టా అందుకున్నారు. ఆ తరువాత కెనడా మెక్ గిల్ యూనివర్సిటీలో మేనేజ్మెంట్ మాస్టర్స్ పూర్తి చేసి 2007లో ఎస్ఆర్ఎం గ్రూప్లో ఉన్న స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డీన్గా పనిచేశారు. విజయవంతమైన అడ్మినిస్ట్రేటర్గా, విద్యావేత్తగా గుర్తింపు కలిగిన డాక్టర్ సతీష్ కుమార్ ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఉద్యోగులు, ప్రొఫెసర్లు సమన్వయంతో సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మన్నెం దంపతులు



ప్రజాశక్తి – మంగళగిరి

శ్రీకాళహస్తిలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం మంగళగిరి మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, శ్రీమతి అనిత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం కార్యనిర్వాహణాధికారి బాపిరెడ్డి మన్నెం దంపతులను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

దీక్షలకు అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు మద్దతు

దీక్షలకు మద్దతు తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తాడేపల్లి పట్టణంలోని టిఎన్టి యుసి మినహా అన్ని అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు మద్దతు పలికాయి. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు ట.వెంకటయ్య, ఏఎన్టియుసి నాయకులు దర్శనపు సామేలు, ఏఐఎఫ్టియు (న్యూ) నాయకులు కే ఆదినారాయణ దీక్షలను ప్రారంభించి, దీక్షపరులను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం ఎప్పటికైనా జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె ఆదినారాయణ, బి వెంకయ్య, ఆశీర్వాదం, భాష, ఎస్ కే ఇమాంబి, సూర్య ప్రకాష్ రావు, యెహోషువ, ఎం గురవయ్య, మాణిక్యరావు, ఇస్రాయెల్ పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి – తుళ్లూరు

మే 2న అమరావతి రాజధాని నిర్మాణ పనులను పున్న ప్రారంభించేందుకు ప్రధాని మోడీ రానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై శనివారం రాష్ట్ర సచివాలయం వెనుక ఏర్పాటు చేస్తున్న సభా వేదిక ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షణ నోడలు అధికారి వీరపాండియన్ సంబంధిత నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా వీరపాండ్యన్ మాట్లాడుతూ వివిధ టాస్క్ లు కేటాయించిన అధికారులు ఆయా పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మోడి మే 2న మధ్యాహ్నం 3గం.లకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుండి హెలికాప్టర్లో రాష్ట్ర సచివాలయానికి చేరుకుని 1.4కి.మీల మేర రోడ్డు షో ద్వారా సచివాలయం వెనుక ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుంటారని తెలిపారు. తదుపరి సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన అమరావతి రాజధాని నిర్మాణ పనుల పున్న ప్రారంభానికి శంఖుస్థాపనతో పాటు పలు అభివఅద్ధి పనులకు ప్రారంభోత్సవం చేయనున్నట్లు చెప్పారు. ప్రధాని సభకు వివిధ ప్రాంతాల నుండి ప్రజలు,ప్రముఖులు చేరుకునేలా 8 రూట్లను సిద్ధం చేయడం జరుగుతోందని, వాహనాల పార్కింగ్ కోసం 9 పార్కింగ్ స్థలాలను గుర్తించి

మాట్లాడుతున్న పర్యవేక్షణ నోడల్ అధికారి వీరపాండియన్

అక్కడ తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని, వివిధ టాస్క్లు కేటాయించిన అధికారులను వీరపాండ్యన్ ఆదేశించారు. గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, డ్యూటీ పాస్ లకు సంబంధించి ఆయా శాఖలు వెంటనే జాబితా ఇవ్వాలని కోరారు.ఇంకా సమావేశంలో ఐజి శ్రీకాంత్, గుంటూరు రేంజ్ ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, త్రివిక్రమ్ వర్మ, పలువురు పోలీసు ఉన్నతాధికారులు, ఐఏఎస్, ఐపిఎస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఇండ్రస్ట్రియల్ ఎస్టేట్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి – మంగళగిరి రూరల్

నవ్యంధ్రప్రదేశ్ రాజధాని లో ఉన్న ఎర్రబాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ అభివృద్ధికి తమ వంతు ప్రయత్నం చేస్తామని సిఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ ఎస్ నరేంద్ర కుమార్ అన్నారు. శనివారం ఉదయం ఇండస్ట్రీయల్ ఎస్టేట్కి వచ్చిన సిఐఐ ప్రతినిధులు యర్రబాలెం ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో స్థానిక గోశాలలో సమావేశం అయ్యారు. అసోసియేషన్ అధ్యక్షులు సరికొండ రామరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు వఅభివృద్ధి చేయాలని ప్రయత్నం చేస్తుందని అన్నారు. దానికోసం ఏం ఎస్ ఏం ఈ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని అన్నారు. సిఐఐ విజయవాడ జోన్ వైస్ చైర్మన్ నాగలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రం అభివఅభివృద్ధి చెందాలంటే

పరిశ్రమల పాత్ర ఏంతో కీలకం అన్నారు. అసోసియేషన్ కార్యదర్శి సీతారామ శర్మ మాట్లాడుతూ యర్రబాలెం ఎస్టేట్ లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు ఎదురు అవుతున్నాయని అన్నారు. సమావేశంలో సిఐఐ ప్రతినిధులు, అసోసియేషన్ నాయకులు అశోక్, అజయ్ బాబు, రావెల శ్రీనివాసరావు, కలపాల్టెరెడ్డి, శ్రీనివాసరావు, ధర్మారెడ్డి, వెంకట్, జీ ఎస్ రాజు, రతన్ లాల్, రమణ, ముని, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ విద్యార్థి సూర్యచంద్రంకు పీహెచ్డీ

ప్రజాశక్తి – గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, కెమిస్ట్రీ విభాగానికి విద్యార్థి సూర్యచంద్రం జెట్టిబోయినకు విజ్ఞాన్ యూనివర్సిటీ పిహెచ్డీ పట్టా అందజేసినట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. సూర్యచంద్రం 'సూపర్హైడ్రోఫోబిక్ పోరస్ కోఆర్డినేషన్ పాలిమర్స్ అండ్ నానో షీట్ పీసీపీఎస్ ఫర్ గ్యాస్ స్టోరేజ్ అండ్ ఎలక్ట్రోకెమికల్ వాటర్ స్ప్లిట్టింగ్' అనే అంశంపై పరిశోధన చేశాడని, ఇతనికి యూనివర్సిటీలోని డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ కోయ ప్రభాకరరావు గైడ్గా వ్యవహరించారన్నారు. విద్యార్థి తన పరిశోధనలో భాగంగా మొత్తం 6 ఎస్సీఐఈ పేపర్లు పబ్లిష్ చేశారని తెలియజేసారు. పీహెచ్డీ పట్టా పొందిన సూర్య చంద్రంను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.



దాతృత్వం చాటుకున్న నటరాజ్ జ్యువెలర్స్

రూ.6లక్షల విలువైన బారికేడ్స్, ట్రాఫిక్ సిబ్బందికి యూనిఫామ్ బహూకరణ

ప్రజాశక్తి – తెనాలి

పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు దాతలు మెండుగా సహకారం అందిస్తున్నారు. బారికేడ్ల ఏర్పాటుకు నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్ సహకరించారు. రూ 6 లక్షల విలువైన బారికెట్లను అందించడంతోపాటు, 30 మంది ట్రాఫిక్ సిబ్బందికి యూనిఫామ్ సమకూర్చారు. డీఎస్పీ బి జనార్ధనరావు ఆధ్వర్యంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం భారికేడ్లను ప్రారంభించారు. ట్రాఫిక్ సిబ్బందికి యూనిఫామ్ అందజేశారు. అదేవిధంగా విఘ్నేశ్వర సర్జికల్స్ రూ.1.50 లక్షలతో కొన్ని భారీకేడ్లకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలకు దాతల సహకారం గొప్పదన్నారు. నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ బి శేషన్న, తహశీల్దార్ కెవి గోపాలకఅష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి ఐకాన్లో రేపటి నుండి బాలల సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి- తాడేపల్లి

అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన, మంగళగిరి-తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలోతాడేపల్లి బైపాస్ రోడ్ సి ఎస్ ఆర్ కళ్యాణమండపం సమీపంలో అమరావతి ఐకాన్ లో ఈనెల 28వ తేదీ నుండి అపార్ట్మెంట్ లోని బాలబాలికలకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించి బ్రోచర్ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి ఐకాన్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం ప్రతినిధులు ఎస్.కె రియాజ్ భాషా, గాది సుబ్బారెడ్డి, న్యాయవాది పి విక్రమ్, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి కె లక్ష్మీ వెంకటరత్నం, పట్టణ పౌర సంక్షేమ సంఘం జె శేషయ్య, విశ్రాంత లెక్చరర్ వి స్వాములు, అమరావతి ఐకాన్ పి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ నుండి మే 12వ తేదీ వరకు డాన్స్ మాస్టర్ చందు, గణితంలో నిష్ణతులు లెనిన్ బాబు డాన్స్ మరియు గణితంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలనుండి 11 గంటల వరకు గణితం, 11 గంటల నుండి 12 గంటల వరకు డ్యాన్సులు శిక్షణ ఉంటుందని చెప్పారు. రెండిటిలో పాల్గనేవారు రూ 500 చెల్లించాల్సి ఉంటుందని, ఒకదానిలో పాల్గనేవారు రూ 250 చెల్లించాలని వివరించారు. వెస్టర్న్ డాన్స్, జానపద నఅత్యాలు మరియు కోలాటాలు తో పాటు గణితంలో మెలుకువలు శిక్షణ ఉంటుందని చెప్పారు. వేసవి సెలవుల్లో ఎటువంటి వ్యాపకం లేకపోతే పిల్లలు సెల్ ఫోన్, టీవీలు ఇతర అలవాట్లకు గురి అయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లలకు సరైన మార్గదర్శ కత్వం వహించటం మన బాధ్యతగా భావించాలని కోరారు. ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గని బాలబాలికల్లో సఅజనాత్మకత, టీం వర్క్, వ్యాయామం, మేధో శక్తి, క్రమశిక్షణ మొదలైన నైపుణ్యాలు పెరుగుతాయని వెల్లడించారు. చదువులో మెరుగ్గా ఉండటానికి కూడా ఉపయోగపడతాయని చెప్పారు. అమరావతి ఐకాన్ అపార్ట్మెంట్ వాసులతో పాటు చుట్టుపక్కల ఉన్న అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్న బాల బాలికల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వై సుబ్బారావు, ఈదర రాజశేఖర్, వి ముఖేష్, పి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన రాయల్ హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని నులకపేట రాయల్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు 10 పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ ఆజాద్ తెలిపారు. 586 మార్కులతో ఎస్.కె నౌషాద్ అలీ పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, జి రాజశేఖర్ 573, కే దిలీప్ 572, శఅతి 571, బి దీపిక 571, ఎస్ హవేల 56 6, ఎస్.కె %ష్ణుంఅఎు% 565, జె సంజు శ్రీ 564, కే సూరజ్ 563, ఎండి సిమ్రాన్జియా 563 మార్కులతో విజయం సాధించారని చెప్పారు.

మలాథియంతో పిచికారి చేస్తున్న మలేరియా సిబ్బంది

ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణ చర్యలు

ప్రజాశక్తి - క్రోసూరు

పల్నాడు జిల్లా క్రోసూరు మండలం క్రోసూరు, దొడ్లేరు గ్రామాల్లో గల ప్రభుత్వ వసతి గృహాల్లో మలాథియం ద్రావణంతో దోమల నివారణ చర్యలు చేపట్టినట్లు సత్తెనపల్లి రూరల్ మలేరియా సబ్ యూనిట్ అధికారి షేక్‌బేగ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా పుట్టకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని, వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కిటికీలకు మెష్‌లు ఉపయోగించుకోవాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్‌సూపర్వైజర్ నాగమల్లేశ్వరరావు, శివుడు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మతల్లి తిరునాళ్ల

ప్రజాశక్తి - క్రోసూరు

స్థానిక అంకమ్మ తల్లి తిరునాళ్ల శనివారం ఘనంగా జరిగింది. మేళ తాళాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మహిళలు బోనాలను సమర్పించారు. దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన ఎలక్ట్రిక్ ప్రభ విశేషంగాఅలరించింది. కోలాటం, భజనలు, భక్తి గీతాలాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి నాయకులైన మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య టిడిపి మండల శాఖ ప్రధాన కార్యదర్శి నలజాల కోటేశ్వరరావు టిడిపి వాణిజ్య విభాగం నాయకులు అనుమాల పూర్ణచంద్రరావును తిరునాళ్ల నిర్వాహకులు సత్కరించారు.

శ్రీరామప్ప దేవాలయంలో మాసశివరాత్రి ప్రత్యేక పూజలు
భక్తులకు మహా అన్నదానం

ప్రజాశక్తి - మాచర్ల

మాసశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక శ్రీ రామప్ప దేవా లయంలో శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమాల్లో కంభంపాటి యల్లమంద, తుమ్మేపల్లి సత్యనారాయణ, షరాబు వెంకటరత్నం, పందిరి సాంబశివరావు, జెవిఎస్ ప్రసాద్, లక్ష్మీమాధవి, గాజుల చినఆంజనేయులు, నాగమణి, దారివేముల రామారావు, భవనారి యతేంద్ర, ఓబులు శెట్టి వాసు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీలో పాత్రికేయులు

ఉగ్రవాదుల దాడిపై పాత్రికేయుల కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ఆ దాడిలో చనిపోయిన వారికి సంఘీభావంగా పాత్రికేయులందరు శనివారం మృతులకు తీవ్ర సంతాపాన్ని బాధిత కుటుంబాలకు పూర్తిస్థాయిలో మద్దతును తెలియజేశారు. స్థానిక ఎన్ఆర్‌టి సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతు ఉగ్రవాదాన్ని కూకట వేళ్ళతో తెగించి వేయాలన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు కార్యక్రమంలో నియోజక వర్గస్థాయి అన్ని పత్రికల, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి
ఎస్ఇ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్ కుమార్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించాలని జిల్లా విద్యుత్ పర్యవేక్షక ఇంజనీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రం రొంపిచర్ల సెక్షన్ పరిధిలోని వి.రెడ్డిపాలెం 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నూరు శాతం విద్యుత్ రెవెన్యూ వసూలు చేయా లని అన్నారు. ప్రతి నెల రెండవ శనివారం విద్యుత్ లైన్ మరమ్మతులు చేపట్టి వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలన్నారు. నూతన సర్వీసులను వెంటనే మంజూరు చేయాలని అన్నారు.50 శాతం రాయితీతో అదనపు లోడ్ క్రమబద్ధీకరించు కునేందుకు జూన్ 30 వరకు అవకాశం ఉన్న నేపథ్యంలో దీనిపై వినియోగదారులకు అవగాహన కలిగించాలని అన్నారు. అదనపు లోడ్‌ను వినియోగదారులు రెగ్యులరైజ్ చేయించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ డిఇఇ బి.వెంకటేశ్వరరెడ్డి, మండల ఏఇఇ కె.రాంబాబు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఇ ప్రతిపాటి విజయ్‌కుమార్

అధికార అండతో వైసిపి సానుభూతిపరులపై దాడులు
మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి-ఈపూరు

పోలీసులు విచక్షణ రహితంగా కొట్టడంతో దెబ్బలు తాళలేక చనిపోవాలని భావించి బొమ్మ రాజు పల్లితండాకు చెందిన భూక్యా రమేష్ నాయక్ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఈపూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భూక్యా రమేష్ నాయక్‌ను శనివారం ఆయన పరా మర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో బొల్లా మాట్లాడుతూ గిరిజనులపై కౌన్సిలింగ్ పేరుతో పోలీసులు దాడులు చేయటం అమానుష చర్య అన్నారు. కూటమి ప్రభుత్వం వైసీపీ సానుభూతి పరులపై తప్పుడు కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కేసులు నమోదు చేసిన వ్యక్తులను స్టేషన్లో ఉంచకుండా, కోర్టుకు హాజరు పరచకుండా ప్రత్యేక గదిలో ఉంచి పోలీసులు పశువుల మాదిరి చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. పోలీసులంటే ప్రజలు గౌర వించే లా ఉండాలని భయపడి పారిపోయి ఆత్మహత్యాయత్నం చేసుకునే పరిస్థితికి ఏర్పడిందన్నారు. ఫ్లెక్సీలను, వైసిపి వేడుకలను అడ్డుకుంటున్నారన్నారు. స్థానిక శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు క్యాబినెట్ హోదాను అడ్డం పెట్టుకొని దాడులకు తెగబడకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం పదవిని ఉపయోగించాలని హితవు పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండవర్జు నాగేశ్వర రావు, సీనియర్ న్యాయవాది ఎంఎన్ ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ అమ్మిరెడ్డి అంజిరెడ్డి, కె.ఎర్రయ్య, వెంకట్రామి రెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

పొట్టి వీరేశం జ్ఞాపకార్థం మజ్జిగ చలివేంద్రం

మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సూర్యప్రకాశరావు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో మహంకాళమ్మ తిరునాళ్ల శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మహంకాళమ్మ గుడి సమీపంలో మాదల గ్రామ వాస్తవ్యులు, పొట్టి వీరేశం జ్ఞాపకార్థం సత్రం వద్ద ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఆయన మనవడు, మజ్జిగ దాత, మాదల మాజీ సర్పంచ్ పొట్టి సూర్య ప్రకాశరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండు వేసవిలో జరుగుతున్న ఈ మాదల తిరునాలకు వచ్చే ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు అనేక సంవత్సరాలుగా మా తాతగారైన పొట్టి వీరేశం జ్ఞాపకార్థం ఒకరోజు ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి తిరునాళ్లకు వచ్చిన ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసి దాహార్తిని తీరుస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు ఎం వెంకటరెడ్డి, కె సాంబశివరావు, జి జాలయ్యచెన్నారావు, షేక్ సైదా, కె నాగేశ్వరరావు, జి సాంబయ్య, ఎ వెంకటనారాయణ, రాము, జి రజిని, కె సుధ,టి లక్ష్మిశేషు తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం 1వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గల రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, షాపింగ్ మాల్స్, జనా వాసాలు రద్దీగా ఉండే ప్రాంతాలలో 1వ పట్టణ సిఐ ఎంవి. చరణ్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్, మెటల్ డిటెక్టర్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ చరణ్ మాట్లాడుతూ జిల్లా ఎస్.పి కంచి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు పట్టణంలో రద్దీ ప్రాంతాలలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అను మానిత వస్తువులు, వ్యక్తులను గుర్తించేందుకు, అక్రమ మాదక ద్రవ్యాల రవాణా అరికట్టేందుకు తమ వంతు కృషి చేస్తున్నా మన్నారు. గంజాయి ఇతర మాధద్రవ్యాల జరుగుతున్నాయా అనే కోణంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. పట్టణంలో ఎవరైనా అనుమానితంగా సంచరిస్తున్నా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసిన ప్రజలు బాధ్యతా యుతంగా తమకు తెలిజేయాలని కోరారు. ఈ తనిఖీల లో ఎస్ఐ వంశీకృష్ణ, అరుణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ కేర్ హాస్పటల్ ఆధ్వర్యంలో నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నరసరావుపేట కిడ్నీ కేర్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఈ నెల 27వతేదీ ఆదివారం ఎసీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కిడ్నీ కేర్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ అబ్బాస్ తెలిపారు. ఆదివారం ఉదయం రూ.4,500లు విలువైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో 20 మంది వైద్యులచే వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని ఈ శిబిరంలో బ్లడ్ టెస్టు, ఇసిజి, 2డి ఎకో, అల్ట్రా సౌండ్, నర్వు కాండక్షన్ స్టడీ, బోన్ మ్యారో డిన్సిటీ టెస్ట్, చెవి, ముక్కు, గొంతు పరీక్షలు, ఉచిత కంటి పరీక్ష లు పూర్తి ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ప్రతి రోగికి పది రోజులు ఉచితంగా మందులు అందిస్తా మన్నారు. పల్నాడు జిల్లా ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నారాయణమ్మకు చెక్కును అందజేస్తున్న సంగండెయిరీ మేనేజర్

మృతుని కుటుంబానికి సంఘం డెయిరీ రూ.60 వేలు బీమా చెక్కు

ప్రజాశక్తి - బెల్లంకొండ: - మృతుని కుటుంబానికి సంఘం డైరీ నరసరావుపేట జోనల్ మేనేజర్ కె. నరేష్‌బాబు రూ.50 వేల చెక్కును అందజేశారు. ఇటీవల కాలంలో నాగిరెడ్డి పాలెం గ్రామా నికి చెందిన వజ్రాల శ్రీనివాస రెడ్డి తండ్రి వజ్రాల సుబ్బా రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. అతను వెన్నా సీతా రామి రెడ్డి నిర్వహిస్తున్న సంగం డైరీ పాల సేకరణ కేంద్రంలో సభ్యుడు కావడంతో దూళి పాళ్ల వీరయ్య చౌదరి (డివిసి) ట్రస్టు ద్వారా ఖాతాదారుల సంక్షేమ నిధి నుండి మృతుని భార్య వజ్రాల నారాయణమ్మ నామినీ కావటంతో ఆమె కుటుంబానికి ఆర్థికంగా సహాయపడేందుకు రూ.60వేల ఇన్సూరెన్స్ చెక్కును శనివారం ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో గంగిరెడ్డి పాలెం ఎమ్‌సిసి మేనేజర్ కె.శ్రీనివాసరావు, సూపర్వైజర్లు సుదీర్ బాబు, సాయి తేజ, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు బద్దూరి వీరా రెడ్డి, యువ నాయకులు బద్దూరి వెంకటకష్ణారెడ్డి, రేషన్ డీలర్ వెన్న శ్రీనివాసరెడ్డి, బూతుకూరి గోవిందరెడ్డి, ఎర్రబద్దూరి సుబ్బా రెడ్డి, తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, చావలి ఎరుకలయ్య, సి. రామకృష్ణ ఉన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

బాసట (సామాజిక సాంస్కతిక వేదిక) ఆధ్వర్యంలో రెగ్యులర్ షుగర్, బిపి ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం మండల కేంద్రమైన యడ్లపాడులోని పిఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తామని బాసట బాధ్యులు తెలిపారు. శిబిరంలో పర్యవేక్షకులుగా సీనియర్ డాక్టర్ లింగమల్ల మోహన్ భాస్కర్ పాల్గొంటారని, రెండు నెలలకు సరిపడ మందులు ఇస్తారని తెలిపారు.

రేపటి నుండి వేసవి ఉచిత శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

బాసట (సామాజిక సాంస్కతిక వేదిక) ఆధ్వర్యంలో మండల కేంద్రమైన నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో వేసవి ఉచిత శిక్షణ శిబిరం సోమవారం నుండి ఉంటుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రటనలో తెలిపారు. 6 నుండి 19వ తరగతి వరకు విద్యార్థులకు గణితం, ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టు లపై అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఉదయం 7.30 గంటల నుండి 11.30 గంటల వరకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. దీంతో పాటు మట్టితో బొమ్మల తయారీ, కథలు చెప్పడం, రాయడం, పేపర్లతో వస్తువుల తయారీ, వక్తృత్వం, ఆటలు, పాఠలకు సంబంధించిన అంశాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాల కోసం బాసట అధ్యక్షులు నూతలపాటి కాళిదాసు 9490099991, సామినేని శ్రీనివాసరావు, 8247001265, కేతా రాంబ్రహ్మం, 9808399169, కల్లూరి శ్రీనివాసరావు, 9492615112 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

అమరావతిలో మోడీ సభకు పల్నాడు నుండి 600 బస్సులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వచ్చేనెల 2న అమరా వతి రాజధాని పురనిర్మాణ కార్యక్రమంలో భాగంగా పర్యటించనున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా నుండి 600 బస్సులలో ప్రజలను చేరవేసే ప్రక్రియలో భాగంగా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు ఆదేశించారు. శనివారం జిల్లా, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 100 బస్సులను అధికంగా సమాయత్తం చేయాలని ఆయన సూచించారు. ప్రతి బస్సులో సంబంధిత డీఎస్ఓ, మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రభుత్వ సిబ్బందిని ఇంచార్జ్ లుగా ఉంచాలని మెడికల్ కిట్లతో పాటు ఒక ఆశా వర్కర్ ను కూడా ఉండేలా చూడాలని సూచించారు.ప్రజలకు అవసరమైన మంచినీరు, అల్పాహారం, భోజన వసతులు ఏర్పాటు చేయాలన్నారు. సభాస్థలి వద్ద పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది ని ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వీటన్ని టికీ జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి రూట్ మ్యాప్ సిద్ధం చేయాలన్నారు. ప్రధానమంత్రి పర్యటన సంబంధించి పల్నాడు జిల్లా కలెక్టరేట్లో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జంతువుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి – గుంటూరు

ప్రజల జీవన విధానంలో భాగమైన జంతువులకు అత్యున్నతస్థాయి సంరక్షణను అందించటంలో పశు వైద్యులతోపాటు, ప్రతి ఒక్కరి బాధ్యత ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక కొత్తపేటలోని జిల్లా పశువైద్యశాలలో జరిగిన ప్రపంచ పశువైద్య దినోత్సవంలో కలెక్టర్ పాల్గన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం ప్రజల ఆరోగ్యంతో అనుసంధానమై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గనటం చాలా సంతోషంగా ఉందని, మా నాన్న కూడా వెటర్నరీ డాక్టర్‌గా మధురై పరిసరప్రాంతంలో సేవలు అందించారని, మేము ఎక్కడ పర్యటించినా ఆప్రదేశంలో కూడా పశు వైద్యశాలల గురించి, పశువైద్య సేవల గురించి విచారించి మమ్మల్ని కూడా పశు వైద్యశాలకు తీసుకుని వెళ్లే వారని, పశువైద్యంతో మాకుటుంబానికి ప్రత్యేకమైన

మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనుబంధం ఉందన్నారు. గ్రామంలో పశుసంపద వల్ల ప్రజలు జీవనోపాధి మెరుగుపడుతుందని, పట్టణాల్లో పెంపుడు జంతువుల పెంపకం పట్ల కూడా ఇష్టాన్ని చూపుతున్నారన్నారు. పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్.ఒ.నరసింహారావు మాట్లాడుతూ ప్రపంచ పశు వైద్య దినోత్సం 2025ను 'పశు ఆరోగ్యం – ఒక బఅందం' అనే థీమ్‌తో జరుపుకుంటున్నామన్నారు. జంతువులకు అత్యున్నత స్థాయి సంరక్షణ, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించటానికి పశువైద్య బృందాలు, నిపుణులు కలిసి పనిచేయాలన్నదే ఈ థీమ్ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడాపోటీలలో విజేతలుకు బహుమంతులు పంపిణీ చేశారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన విశ్రాంత పశువైద్యులు డాక్టర్. డి.రజనీకాంత్, డాక్టర్.ఆర్.లక్ష్మీప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ కె.వి.వి. సత్యనారాయణ, డాక్టర్. ఎం. రత్నజ్యోతి, రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ వై.ఈశ్వర్‌రెడ్డి, జిల్లా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్.ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి– తాడేపల్లి

అమరావతి ఐకాన్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఐకాన్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఎస్ కే రియాజ్ భాషా, ఈ రాజశేఖర్, కె.లక్ష్మీ వెంకటరత్నం, పి కోటేశ్వరరావు తెలిపారు. శనివారం వారు మీడియాతో మాట్లాడారు. ఎముకలు, కీళ్ల మరియు వెన్నుపూస సమస్యలు, స్త్రీ ప్రసూతి మరియు లాపారుస్కో పి, బిపి, షుగరు, థైరాయిడ్ మరియు జనరల్ వైద్య సేవలు, గుండెకు సంబంధించిన సమస్యలు, చిన్నపిల్లలకు సంబంధించిన సమస్యలకు వైద్యశాలను అందించబడతాయని చెప్పారు. అవసరమైన వారికి ఏకో, కంటి శుక్లాల పరీక్షలు, రక్త పరీక్షలు, ఎముకల సాంద్రత పరీక్షలు ఉచితంగా చేస్తామని, మందులు కూడా ఉచితంగా అందజేస్తారని తెలిపారు.విజయవాడ, శ్రవంతి హాస్పిటల్ కు సంబంధించిన నిష్ణాతులైన వైద్యులు ఈ వైద్య శిబిరంలో తమ సేవలు అందిస్తారని, అమరావతి ఐకాన్ అపార్ట్మెంట్ వాసులు దీన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై సుబ్బారావు, పి విక్రమ్, వి ముఖేష్, జె.శేషయ్య, వి.స్వాములు, గాదే సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

28 నుండి గ్రంథా లయ సంస్థ వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి – గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయసంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 28 నుండి జూన్ 6వ తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. శనివారం విజ్ఞాన శిబిరానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో 40 రోజులపాటు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు ఈ వేసవి శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కథలు చదివి వినిపించడం, పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్షలు, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్,. డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, పప్పెట్ మేకింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్, జికె వంటి అంశాలలో శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, ఉపగ్రంథపాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ యం.సీతారామయ్య, లైబ్రేరియన్స్ కె.చిన్నపరెడ్డి, యన్.నాగిరెడ్డి, బ్రహ్మయ్య, రాజేష్, విజయ్ కుమార్, సంజయ్ పాల్గొన్నారు.

వేసవి ముగిసేలోగా పారిశుధ్య పనుల్లో మార్పులు

- **మురుగునీటితో నష్టపోతున్న రైతులకు న్యాయం చేస్తాం**
- **డంపింగ్ యార్డును పరిశీలించిన మంత్రి మనోహర్**

ప్రజాశక్తి–తెనాలిరూరల్

తెనాలి శివారు బుర్రిపాలెం రోడ్డులోని చెత్త డంపింగ్ యార్డును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం సందర్శించారు. సగటున రోజుకు ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారు తదితర వివరాలపై పూర్తి వివరణ తీసుకున్నారు. కోకోపిట్ యంత్రాలు నిర్వహణ, బయో కంపోస్టు, వర్మీ కంపోస్టు తయారీ విధానంపై సిబ్బందితో మాట్లాడారు. స్వచ్ఛంద్రాలో భాగంగా మే ఆఖరికల్లా చెత్త నిర్వహణ 50 శాతానికి పెంచాలని ఆదేశించారు. వీధికుక్కల సంతానోత్పత్తి శస్త్ర చికిత్సాలయం విభాగాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కుక్కల స్వైర విహారాన్ని కట్టడిచేసి, వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ ఆరోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. దాదాపు 55 ఏళ్ల క్రితమే తెనాలిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటయ్యిందని, తాను సభాపతిగా ఉన్నప్పుడు చెత్త నిర్వహణ ప్రణాళికాబద్ధంగా జరిగిందని అన్నారు. డంపింగ్ యార్డ్ ద్వారా వెలువడుతున్న హానికరమైన పొగ అనారోగ్యానికి గురి చేస్తుందని, పర్యావరణ హితానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తెనాలి డంపింగ్ యార్డు

సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

దయనీయస్థితిలో ఉందన్నారు. పారిశుధ్య పరిశుభ్రత, చెత్త సేకరణ, తరలింపుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రూ.3.20 కోట్లతో యార్డు నుంచి చెత్త తరలిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కొంత జిందాల్ సంస్థకు చెత్త వ్యర్థాలను తరలిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ నిధులతో వేసవి ముగిసేలోపు పారిశుధ్య పనుల్లో మార్పు తెస్తామన్నారు. డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాలు, మురుగునీటి నిల్వలు కారణంగా తమ పంట పొలాలు నాశనం అయ్యాయని చుట్టుపక్కల రైతులు ఆవేదన వ్యక్తం చేశారని, రైతులకు న్యాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ టి.రాధిక, కమిషనర్ బి.శేషన్న, ఎంహెచ్ ఓ డాక్టర్ హెలెన్ నిర్మల, ఎంఇ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చలపతి కాలేజీలో ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి–గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో జునీపర్ నెట్‌వర్క్స్, ఎడ్యుస్కిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించిన ఎఐసిటిఇ అటల్ ఎడ్యుస్కిల్స్ జునీపర్ నెట్‌వర్క్స్ మిస్ట్ ఎఐ అధ్యాపకుల శిక్షణ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో టాలెంట్ ఎడ్యుస్కిల్స్ డెవలప్‌మెంట్ మేనేజర్ మితుస్వాన్ జునీపర్ నెట్‌వర్కింగ్ ఫండమెంటల్స్, జునోస్, మిస్ట్ ఎఐ, స్విచ్చింగ్, రౌటింగ్, డెవ్ ఆప్స్, క్లౌడ్ ఫండమెంటల్స్, జునీపర్ లోకేషన్ సర్వీసెస్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నెల రోజుల్లో వెయ్యి టన్నుల చెత్త సేకరణ : కమిషనర్

ప్రజాశక్తి – మంగళగిరి

స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో వెయ్యి టన్నుల చెత్త సేకరణ చేశామని కార్పొరేషన్ కమిషనర్ ఆలింబాష చెప్పారు. శనివారం కమిషనర్ చాంబర్లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న రోజుల్లో చెత్త రహిత మంగళగిరిగా తీర్చిదిద్దటమే ప్రధాన లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో నిర్వహించిన స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం నెల రోజులు పూర్తి చేసుకున్న ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు సిబ్బందితో కలిసి ప్రతిరోజు స్థానికులకు పరిసరాల పరిశుభ్రత చెత్త సేకరణ

పై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని అన్నారు. ప్రధానంగా అపార్ట్మెంట్స్, విల్లాస్ ఇతర ప్రదేశాలలో చెత్త సేకరించడంలో కొంత సమయం తీసుకోవాలని కార్మికులకు అవగాహన కల్పించినట్లు ఆయన చెప్పారు. నియోజకవర్గం లో 200 కిలోమీటర్ల వరకు డ్రైనేజీ క్లీనింగ్ చేయటంతో పాటు ప్రధాన డ్రైనేజీ పూడికలను ఈ నెలలో పూర్తి చేస్తామని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజల సహకారంతో చెత్త రహిత స్వచ్ఛ మంగళగిరిగా తీర్చిదిద్దటమే ప్రధాన కర్తవ్యం అని కమిషనర్ ఆలిం భాష తెలిపారు.

గుంటూరు జిల్లా

ఆదివారం 27 ఏప్రిల్ 2025

సర్టిఫికెట్లు అందుకుంటున్న శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులు

సెయింట్ ఆన్స్‌లో ముగిసిన ఐసిటి టూల్స్ శిక్షణ

ప్రజాశక్తి – గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఐదు రోజుల నుండి ఐసిటి టూల్స్ వినియోగంపై ఐక్యూఎసి కమిటీ వారు అధ్యాపకులకు నిర్వహించిన శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య అధ్యక్షత వహించగా, డేటావ్యాలీ సంస్థ తరపున టి.ప్రమోద్, ఎ.చక్రవర్తి, అడ్వాన్స్ ఎక్సెల్‌పై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. శిక్షణ ముగిసిన తర్వాత అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

బిషప్ జాన్‌పాల్‌కు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి – తెనాలి

స్థానిక మారిసుపేట రాక్ గాస్పెల్ చర్చి సంఘ కాపరి బిషప్ పినపాటి జాన్‌పాల్ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. అమెరికాలోని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ థియోలాజికల్ అక్రిడిటేషన్ సంస్థ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన బెంగళూరులోని న్యూ విజ్డమ్ బైబిల్ కళాశాలలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో ఆయనకు కళాశాల యాజమాన్యం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బిషప్ జాన్‌పాల్‌కు డాక్టరేట్ రావడంపై పట్టణ ప్రముఖులు, రాక్ గాస్పెల్ చర్చి సంఘ సభ్యులు ఆయనను అభినందించారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

ప్రజాశక్తి – తెనాలి

పట్టణానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఆళ్ల నాగిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్థానిక చెంచుపేటలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. సుప్రియ స్మారక ఆయుర్వేద వైద్య సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో కీళ్ల, నరాలు, కండరాల నొప్పులు, స్త్రీల సంబంధిత వ్యాధులకు చికిత్స అందించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ పి నాగేంద్రబాబు, డాక్టర్ జి సుధీర్ రెడ్డి, డాక్టర్ ఆర్ ఎం శిరీష, డాక్టర్ నాగిరెడ్డి రోగులకు చికిత్స అందించారు. శిబిరంలో 100 మంది రోగులు చికిత్స పొందినట్లు డాక్టర్ నాగిరెడ్డి వెల్లడించారు.

గ్రామాల పరిశుభ్రతకు చర్యలు

ప్రజాశక్తి – తుళ్లూరు

రాజధాని గ్రామాల్లో పరిశుభ్రతకు అధికారులు చర్యలు చేపట్టారు.మే 2 న ప్రధాని మోడీ రాజధానికి రానున్న నేపధ్యంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు.పారిశుధ్య మెరుగుకు ఇతర గ్రామాల నుంచి అదనపు సిబ్బందిని రప్పిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రహదారులపై చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నారు.కాల్వల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మైకు ప్రచారం నిర్వహిస్తున్నారు.చెత్తా చెదారం,ఇతర వ్యర్థాలను రోడ్లపై పడవేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తెనాలి బాలికలు

ప్రజాశక్తి - తెనాలి

యండ్రపాటి మౌనిక, యండ్రపాటి నయన శ్రీ

పట్టణానికి చెందిన యండ్రపాటి మౌనిక, యండ్రపాటి నయన శ్రీ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. పట్టణంలోని చెంచుపేటకు చెందిన వీరు విజయవాడ శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. గతేడాది డిసెంబర్ ఒకటిన హెలెల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా ఆగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో 18 దేశాల విద్యార్థులు మ్యూజిక్ ప్రదర్శనలో ఆన్లైన్ వేదికగా పాల్గన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గన్న మౌనిక, నయన శ్రీ కీ బోర్డు ప్లే చేసి అత్యంత ప్రతిభను కనబరచడంతో గిన్నిస్ బుక్‌లో స్థానం లభించిందని, ఈ నెల 25న విజయవాడ మెట్రోపాలిటన్ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతినిధులు పంపిన మెడల్స్, సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను పాస్టర్ అగస్టీన్ దండంగి చేతుల మీదుగా అందుకున్నట్లు వారి కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, సహా విద్యార్థులు, బంధుమిత్రులు వారిని అభినందించారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలంలోని నిడమర్ గ్రామంలోని దళిత వాడికి చెందిన వఅద్ధురాలు కట్టె పోగు లూర్దమ్మ 80 సంవత్సరాలు వడదెబ్బ తగిలి మఅతి చెందింది. నిడమర్రు గ్రామంలోని టిడ్కో గఅహాల వద్ద ఉన్న బంధువులు ఇంటికి శనివారం వెళ్లి ఇంటికి వచ్చి పడుకుంది. ఎంతసేపటికి లెగవకపోవడంతో చుట్టుపక్కల వాళ్ళు చూశారు. అప్పటికే మఅతి చెంది ఉంది. ఎండలో తీవ్రంగా ఉండడంతో వడదెబ్బకు మఅతి చెందినట్లుగా బంధువులు తెలిపారు.

రేపు జిఎంసి గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి- గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికల దృష్ట్యా సోమవారం నిర్వహించాల్సిన గ్రీవెన్స్, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కావున నగర ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. స్థానిక సమస్యలపై ఫిర్యాదుల కోసం జిఎంసి కాల్ సెంటర్ 0863-2345103కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

మలినేనిలో యాక్సెస్-2025 అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అడ్వాన్సు కమ్యూనికేషన్, కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్ సిస్టమ్-2025 పేరుతో అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహించారు. యుసిఎస్ఐ యూనివర్సిటీ మలేషియా సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో ఇసిఎస్ఐ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ రేణు కొలంబైసామి పాల్గొని ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఉపయోగాలు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఐఓటి ప్రాముఖ్యతను వివరించారు. విట్ ప్రొఫెసర్ డాక్టర్ జయేంద్రకుమార్, కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసకుమార్, డాక్టర్ అనిల్ కుమార్, డీన్స్ ,వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

30న నిరుద్యోగ యువతకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి - గుంటూరు

స్మార్ట్‌టెక్స్, జిఎంసి సంయుక్తంగా మేలో నిర్వహించే మెగా జాబ్ మేళాకు సంబంధించి ఈనెల 30 న స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో తుది అవగాహన సదస్సు ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగ యువత తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు మే 15వ తేదీలోగా బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. కావున ప్రతి ఒక్కరూ అవగాహన సదస్సుకు హాజరు కావాలని కోరారు.

అమరావతి రైతుల్లో అయోమయం

విశ్లేషణం

రాజధాని నిర్మాణంలో భాగంగా మరో 44 వేల ఎకరాలను భూ సమీకరణ ద్వారా తీసుకుంటారనే ప్రచారంతో అమరావతి రైతుల్లో అయోమయం నెలకొంది. వేర్వేరు అవసరాలకు ఇంత భూమిని ప్రభుత్వం సమీకరిస్తుందన్న ప్రచారంతో రాజధాని వెలుపల ఉన్న మండలాల్లోని పలు గ్రామాల్లో లావాదేవీలు పెరుగుతున్నాయి. దీంతో రాజధాని గ్రామాల్లో భూములు కొనేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదు. రాజధాని రైతులు ధరలు భారీగా పెంచడం వల్లే కొనుగోలు దారులు రావడం లేదని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం మరో 44 వేల భూమిని సమీకరణ ద్వారా తీసుకుంటుందనే ప్రచారంతో రాజధాని పరిసర మండలాల్లోని అన్ని గ్రామాల్లో క్రయ విక్రయాలకు కొంత భూమ్ వచ్చింది. 2015 జనవరిలో ప్రారంభం అయిన భూ సమీకరణలో 37,941 ఎకరాలకు గాను 34,689 ఎకరాలను సిఆర్‌డిఏకు రైతులు అప్పగించారు. ఇంకా 3,252 ఎకరాలు ఇవ్వడానికి దాదాపు వెయ్యి మంది రైతులు సుముఖత వ్యక్తం చేయలేదు. భూ సమీకరణలో తీసుకున్న 34,689 ఎకరాలతో పాటు ప్రభుత్వ భూములు మరో 17 వేల ఎకరాలు కూడా రాజధానికి వినియోగించుకునేందుకు సిఆర్‌డిఏ తన అధీనంలోకి తీసుకుంది. మొత్తంగా 51 వేల ఎకరాలు రాజధానికి సిద్ధం చేశారు. ఇంత భూమి అందుబాటులో ఉన్నా అన్ని నిర్మాణాలకు వినియోగించగా మిగిలేది కేవలం 5 వేల ఎకరాలనేని మంత్రి నారాయణ చెబుతున్నారు. తాజాగా రాజధానిలో అంతర్జాతీయ విమానాశ్రయం, కొత్త రైల్వే లైను, మెట్రో నిర్మాణం, అవుటర్ రింగ్ రోడ్డు, హైదరాబాద్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే తదితర ప్రాజెక్టులకు భారీగా భూమి అవసరం ఉందని అందువల్ల రాజధాని పరిసర మండలాల్లో భూ సమీకరణ-2ను ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే బౌద్ధారామం అమరావతిలో అభిప్రాయ సేకరణ ప్రారంభించారు. గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ప్రధాన మంత్రి పర్యటన తరువాత మే మొదటి వారంలో గ్రామ సభలను ముమ్మరంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈనేపథ్యంలో రాజధానిలోని 26 గ్రామాల్లో రైతుల నుంచి భూములు తీసుకున్న సిఆర్‌డిఏ మూడేళ్లలో అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగిస్తామని హామీ ఇచ్చింది.కానీ వేర్వురు కారణాలతో 10 ఏళ్ల అయింది. రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఎప్పటికి అప్పగిస్తారన్నదీ ఇప్పటికీ అయోమయంగానే ఉంది. ప్రస్తుతం రాజధాని రైతులకు కేటాయించిన భూముల అభివృద్ధికి కూడా టెండర్లు పిలిచారు. ఏడాదిలో ఈ పనులు పూర్తవుతాయని భావిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు తమ భూములను సమీకరణ ద్వారానే ఇతరులకు విక్రయించుకున్నారు. దాదాపు 6 వేల ఎకరాలు చేతులు మారినట్టు సమాచారం. ఈనేపథ్యంలో రాజధాని నిర్మాణాలు పూర్తయి తమ ప్లాట్లుకు మంచి ధరలు వచ్చి లబ్ధిపొందుదామని అనుకుంటున్నరైతులకు అదనపు భూ సమీకరణ అంశం సమీకరణలో భూములు ఇచ్చిన రైతులకు మింగుడు పడటం లేదు. మళ్లీ 44 వేల ఎకరాలు తీసుకుంటే భూములను ఎప్పటికీ అభివృద్ధి చేస్తారు? అంత ఆర్థిక స్థోమత ప్రభుత్వం వద్ద ఉందా అన్న అంశం చర్చనీయాంశంగామారింది. 44 వేల ఎకరాల భూముల సమీకరణ వార్తల నేపథ్యంలో రాజధాని రైతులలో అంతర్గతంగా అలజడి ప్రారంభం అయింది. రాజధాని పరిసర గ్రామాల్లో అమరావతి మండలంలో మరో పది వేల ఎకరాలను తొలి విడతలో సమీకరించుకునేందుకు ఆయా గ్రామాల్లో వారం రోజులుగా గ్రామసభలు జరుగుతున్నాయి. మూడు గ్రామాల సభల్లో భూములు ఇచ్చేందుకు సిద్ధమే అంటూనే పలు సమస్యలను ప్రభుత్వం ముందుంచారు. అమరావతి మండలంలోని వైకుంఠపురం, యండ్రాయి, పెద మద్దూరు, కర్లపూడి గ్రామాల్లో రైతులు భూములిచ్చేందుకు ముందుకు వచ్చిన రైతులు పలు అంశాలను అధికారులతో చర్చించారు. భూసేకరణ విధానంలో భూములిస్తే రైతులు నష్టపోతారని భూ సమీకరణ విధానంలో పొలాలు అప్పగిస్తే మేలు జరుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గ్రామ కంఠం నుండి 500 మీటర్ల వెలుపలనే భూ సమీకరణ చేయాలన్నారు. రోడ్డు వెంట భూముల అధిక విలువైనవని వాటికి రాజధానిలో ఇచ్చిన జరీబు భూముల ప్యాకేజ్ ఇవ్వాలంటున్నారు. ఈ పరిస్థితుల్లో పరిసర గ్రామాల్లో క్రయ విక్రయాలు పెరిగితే రాజధానిగ్రామాల్లో భూములకు ధరలు తగ్గుతాయని ఆందోళన లేకపోలేదు. అంతేగాక డిమాండ్ కూడా పడిపోతుందని వారు కంగారు పడుతున్నారు.

– ఎ.వి.డి.శర్మ

తరగతులు నిర్వహించే కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

ఆర్ఐఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు

కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ సందర్భంగా శనివారం ఆర్ఐఓ జి.కె.జుబేర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ ఏప్రిల్ 23న రాష్ట్ర ప్రభుత్వం కాలేజీలకు సెలవులు ప్రకటించిందని, కానీ కొన్ని కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులను మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పుడే సిలబస్ ప్రారంభిస్తామని, మీరుగానీ హాజరు కాకపోతే మళ్ళీ సిలబస్ భోధించమని, మార్కులు తగ్గుతాయని విద్యార్థులపై యాజమాన్యాలు వత్తిడి చేస్తున్నాయన్నారు. అటువంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్.సమీర్, నగర కార్యదర్శి యశ్వంత్, నగర ఉపాధ్యక్షులు సౌమ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు పాటల నివాళి

దేవేంద్ర, జయరాజ్‌కు భీమ్ కళాజ్యోతి పురస్కారాలు

దేవేంద్ర, జయరాజ్‌ను సత్కరిస్తున్న నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జాషువా కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సృనాత్మకత, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శనివారం జైభీమ్ జనగానం-అంబేద్కర్ పాటల పండుగ నిర్వహించారు. ప్రజా గాయకుడు పివి రమణ సారధ్యంలో బహుజన గాయకులు పల్లె నరసింహ, నూకతోటి శరత్‌బాబు, ఆర్.రాజేష్, ఉదయ భాస్కర్, లెనినా, సత్య జయరామ్, సోమన్న, కిన్నర్ యాదగిరి, అంజన్న, విప్లవకుమార్ తదితరులు అంబేద్కర్, బహుజన గేయాలు ఆలపించారు. తొలుత సంస్కృతి వ్యవస్థాపకులు స(్రాజు బాలచందర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అణగారి వర్గాల హక్కుల కోసం జాగోరే జాగో అంబేద్కర్ లాంటి పాటలతో ప్రజాసాంస్కృతిక యోధులు జయరాజ్, సంఘం శరణం గచ్ఛామి అంబేద్కర్ కళారూపకం సత్యశోధన పూలే కళారూపకాలను ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రదర్శనలు ఇచ్చి చరిత్ర సఅష్టించిన కె.దేవేందర్‌కు 'భీమ్ కళాజ్యోతి' పురస్కారాలను మాజీ మంత్రి, వేమూరు శాసనసభ్యులు నక్క ఆనందబాబు, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, జాషువా కల్చర్ సెంటర్ గౌరవాధ్యక్షులు బాలస్వామి, అధ్యక్షులు డాక్టర్ పోలే ముత్యం, మద్దిరాలమ్మాని, ఎన్.జే విద్యాసాగర్, నూతలపాటి కాళిదాసు, కొరివి వినయ్‌కుమార్, గోళ్ళ అరుణ్‌కుమార్ చేతులమీదుగా అందించి సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నక్కా ఆనందబాబు మాట్లాడుతూ అంబేద్కర్ భారత జాతి గుండె చప్పుడు అని జాషువా కల్చరల్ సెంటర్ ద్వారా అంబేద్కర్‌కు పాటల పట్టాభిషేకం చేయటం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో దళిత, బహుజన ప్రజాసంఘాలు, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్, తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ వాహనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో సెప్టిక్‌ట్యాంక్ వ్యర్థాలను రోడ్లపక్కన, డ్రైయిన్లలో వేయడానికి వీలులేదని, అలావేస్తే ట్యాంకర్లను సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు స్పష్టం చేశారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరంలోని సెప్టిక్ ట్యాంకర్ల యజమానులు, కాంట్రాక్టర్లతో శనివారం జిఎంసి కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సఫాయి కర్మచారి చట్టం 2013 ప్రకారం సెప్టిక్ ట్యాంకర్ల వద్ద పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా పిపిఈ కిట్‌లు ధరించి విధులు నిర్వహించాలన్నారు. నగరంలోని సెప్టిక్ ట్యాంకర్లు తప్పనిసరిగా సుద్దపల్లి డొంకలోని నగరపాలక సంస్థ ఎఫ్ఎస్టీపికే వ్యర్థాలను తరలించాలని, అక్కడ శాస్త్రీయ పద్ధతిలో నిర్వహణ చేయడం జరుగుతుందన్నారు. జిఎంసి రిజిస్ట్రేషన్ లేని వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, డిఈఈ నాగభూషణం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని గుంటూరు జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శనివారం నరసరావుపేట న్యాయస్థాన భవనాలను ఆయన న్యాయస్థాన భవనాలను న్యాయవాద సంఘ కార్యాలయాన్ని సందర్శించారు. కోర్టు సముదాయంలో గల భవనాలను ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పరిశీలించారు. అవసరమైన మరమ్మత్తులు తక్షణమే చేపట్టాలని రోడ్డు భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. న్యాయవాదుల సమస్యలను ఆడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్.పి కె.శ్రీనివాసరావు నరసరావుపేట న్యాయాధికారులు నేతి సత్య శ్రీ, కె.మధు స్వామి, ఎం.గాయత్రి, న్యాయవాద సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.